


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 26 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 196 పేజీలు: 4 వెల: రూ 3-00


## సంక్షేమ పథకాల క్యాలెండర్.. ఇది పేదవర్గాలకు వెల్‌ఫేర్.. చంద్రబాబుకి ఫేర్‌వెల్: సీఎం జగన్



అమరావతి: తమది ప్రతిపక్షం ఆరోపిస్తున్నట్లు అంకెల గారడీ బడ్జెట్ కాదని, గత మూడేళ్లుగా ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసమే మంచి బడ్జెట్ ప్రవేశపెట్టామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ముగింపు సెషన్ సందర్భంగా.. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను విడుదల చేశారాయన. ఈ సందర్భంగా..సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను స్వయంగా చదివి వినిపించిన అనంతరం సీఎం జగన్ మాట్లాడారు. ఇది పేద వర్గాలకు వెల్‌ఫేర్ క్యాలెండర్ అని.. ప్రతిపక్ష నేత చంద్రబాబుకు, ఆయనకు ఢంకా బజాయించే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లకు ఏమాత్రం రుచించని క్యాలెండర్ అని, ఒకరకంగా గుబులు పుట్టించే క్యాలెండర్ అని వైఎస్ జగన్ చమత్కరించారు. పైగా ఇది చంద్రబాబుకు ఫేర్‌వెల్ క్యాలెండర్ అవుతుందని చెప్పారు సీఎం వైఎస్ జగన్. కరోనా లాంటి సమయంలోనూ.. ప్రజలకు సంక్షేమ ఫలాలు ఎక్కడా ఆగలేదని గుర్తు చేశారు సీఎం జగన్. ఎక్కడా కులం, మతం, ప్రాంతం, పార్టీలు కూడా చూడకుండా అందరూ మనవాళ్లే, అందరూ నా వాళ్లే అని నమ్మి ఈ ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. సంక్షేమ అభివృద్ధి పథకాల ఫలాలు.. ఎప్పుడు, ఏ నెలలో అమలు చేస్తున్నామో సందేహాలకు తావు లేకుండా ముందుకెళ్తున్నామని అన్నారాయన. పైగా లబ్ధిదారులు ప్లాన్ చేసుకునేందుకు వీలుగానే కాకుండా.. పారదర్శకంగా, అవినీతి, వివక్షకు లేకుండా ఏ నెలలో ఏ స్కీమ్ వస్తుందో చెబుతూ క్రమం తప్పకుండా అమలు చేస్తూ.. భరోసా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని సీఎం వైఎస్‌జగన్ అన్నారు. మంచి బడ్జెట్.. దేవుడి దయ.. ప్రజలందరి చల్లని దీవెనలు ప్రభుత్వానికి ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటున్నట్లు చెబుతూ ప్రసంగం ముగించారు. అనంతరం జనరంజకమైన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2022-23ని రాష్ట్ర అసెంబ్లీ శుక్రవారం ఆమోదించిన స్పీకర్.. సభను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## టీడీపీ పెగాసెస్ వ్యవహారంపై అసెంబ్లీ హౌస్ కమిటీ



అమరావతి: టీడీపీ పెగాసెస్ వ్యవహారంపై శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారం హౌస్ కమిటీ వేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని నియమించారు. అదే విధంగా కమిటీ సభ్యులుగా భాగ్యలక్ష్మి, అబ్బయ్య చౌదరి, కొలుసు పార్థసారధి, అమర్నాథ్, మేరుగు నాగార్జున, మద్దాల గిరిధర్‌ను నియమించారు.కాగా రాష్ట్రంలో పెగసస్ స్పైవేర్ బాగోతం గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపుతోంది. టీడీపీ హయాంలో పెగసస్ స్పైవేర్‌ను కొనుగోలు చేశారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో దీనిపై పెద్దఎత్తున చర్చ మొదలైంది. రాష్ట్ర శాసనసభలోనూ సోమవారం తీవ్ర దుమారం రేపింది. అప్పటి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతల ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారం కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. దీంతో స్పైవేర్ ఉదంతంపై హౌస్ కమిటీ ఏర్పాటుచేయాలని సోమవారమే అసెంబ్లీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాల్లో చివరి రోజైన శుక్రవారం నాడు టీడీపీ పెగాసెస్ వ్యవహారంపై స్పీకర్ హౌస్ కమిటీ వేశారు.

## పప్పులు, నూనెల ధరల స్థిరీకరణకు చర్యలు

### రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు

న్యూఢిల్లీ, మార్చి 25: దేశంలో ఆహార ధాన్యాలు ముఖ్యంగా పప్పులు, వంటనూనెల ధరలు స్థిరీకరించడానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఆహార శాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ వినియోగదారుల ఆహార ధరల సూచీ (సీపీఎఫ్ఐ) ఆధారంగా ఆహార ధాన్యాల



ధరల్లో హెచ్చు తగ్గులను ప్రభుత్వం మదింపు చేస్తుంటుందని చెప్పారు. ఆహార ధాన్యాలు, ఉద్యానవన ఉత్పాదనల ధరల హెచ్చు తగ్గులకు అనేక కారణాలు ఉంటాయి. డిమాండ్-సప్లైలో వ్యత్యాసం, సీజన్, సప్లై చైన్లో ఏర్పడే అవరోధాలు, బ్లాక్ మార్కెటీర్లు సృష్టించే కృత్రిమ కొరత, అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదల వంటి వివిధ అంశాలు ఆహార ధాన్యాల ధరలను ప్రభావితం చేస్తుంటాయని మంత్రి చెప్పారు. రిటైల్ మార్కెట్లో ఆహార ధాన్యాల ధరల తీరు ఆధారంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు అనేక చర్యలు తీసుకుంటుంది. నిత్యావసర ఆహార ధాన్యాల ధరలను స్థిరీకరించేందుకు స్టాక్ పరిమితులు విధించడం, వివిధ సంస్థలు ప్రకటించే ఆహార ధాన్యాల స్టాక్ను పర్యవేక్షించడం, ఆహార ధాన్యాల దిగుమతులపై సుంకాలను తగ్గించడం, ఎగుమతులపై ఆంక్షలు విధించడం వంటి చర్యలతో ప్రభుత్వం ఆహార ధాన్యాల ధరలు పెరుగుదలకు కళ్ళెం వేస్తుంటుందని తెలిపారు. మిల్లర్లు, దిగుమతిదార్లు, ట్రేడర్లు తమ వద్ద ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను బహిర్గతం చేయాల్సిందిగా గత ఏడాది మేలో రాష్ట్రాలకు సూచలు పంపించాం.

## సామాజిక పెన్షన్ల మంజూరులో విప్లవాత్మక మార్పులు



### వైయస్ఆర్ పెన్షన్ కానుక ద్వారా 61 లక్షల మందకి పైగా లబ్ధి
### ప్రతి నెలా సుమారు రూ.1557 కోట్లు కేటాయింపు
### రూ.2500కి పెంచి పింఛన్ మొత్తాల పంపిణీ
### శాసనమండలిలో మంత్రి శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అమరావతినవరత్నాలు ద్వారా ఈ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హతే ప్రామాణికంగా అందరికీ చేరువ చేయాలని సీఎం శ్రీ వైయస్ జగన్ సంకల్పించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ?. దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ లేని విధంగా సీఎం శ్రీ వైయస్ జగన్ సామాజిక ఫించన్ల అమలులో విప్లవాత్మక చర్యలు తీసుకున్నారని అన్నారు. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వైద్య చికిత్స వల్ల జీవనోపాధి కోల్పోయినటువంటి వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి, వారు గౌరవ ప్రధమైన జీవితాన్ని పొందడానికి "వైయస్ఆర్ పింఛను కానుక" పథకంను సంతృప్త స్థాయిలో ఈ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎన్నికలకు 5 నెలల ముందు వరకు కేవలం రూ.1000 మాత్రమే పెన్షన్ కింద ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 2014 నుంచి అక్టోబర్ 2018 మధ్యన ఇచ్చిన ఫించన్లు 40 నుంచి 43 లక్షలు మాత్రమే. ఎన్నికలకు చివరి 6 నెలల్లో హడావుడిగా పెంచిన ఫించన్లు 9,00,003. గత ప్రభుత్వం 5 సంవత్సరాలలో ఫించన్ పై ఖర్చు చేసింది రూ.27,687 కోట్లు మాత్రమే. శ్రీ వైయస్ జగన్ గారు సీఎం అయిన తరువాత ముఖ్యమంత్రిగా ఆయన చేసిన మొదటి సంతకం ఫించన్ వయోపరిమితి ని 65 నుంచి 60 కి తగ్గించడం పైనే. దీని ద్వారా 10.60 లక్షల మందికి ప్రయోజనం జరిగింది. అంతేకాకుండా ఫించన్ మొత్తాన్ని రూ.2,250/- కి పెంచడం, రెండో విడతగా జనవరి 2022 లో దానిని రూ.2,500/- కి పెంచిన ఘనత కూడా సీఎం శ్రీ వైయస్ జగన్ గారికే దక్కుతుంది. ఈ ప్రభుత్వం సుమారు 61 లక్షల పైన ప్రతి నెలా ఫించన్లను పంపిణి చేస్తోంది. దీని పై ప్రతి నెలా రూ.1557 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 18.75 లక్షల కొత్త ఫించన్లు మంజూరు చేయడం జరిగింది. ఈ 33 నెలల కాలంలో ప్రభుత్వం ఫించన్లు పై రూ.47,646 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.68 లక్షల గ్రామ, వార్డ్ వాలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి వారి గడప వద్దనే పెన్షన్ మొత్తాలను వారి చేతికే అందిస్తున్నారు.

## టీడీపీది 40 ఏళ్ల ప్రస్థానం: చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలో టీడీపీ 40 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. టీడీపీ 40 ఏళ్ల ప్రస్థానం లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి కష్టాల్లో ఉన్నప్పుడు ఎన్టీఆర్ పార్టీ పెట్టారన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. బీసీలకు రాజకీయంగా గుర్తింపు తెచ్చిన పార్టీ టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం మరణాలను సహజమరణాలుగా చిత్రీకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంత బాధ్యతలేని ప్రభుత్వాన్ని తాను చూడలేదన్నారు. మద్యం కల్తీ బ్రాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం జగన్ అసమర్థత వల్లే పోలవరానికి ఈ దుస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు.

## సీఎం జగన్ వ్యాఖ్యలపై స్పందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ: ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ న్యాయస్థానాన్ని అందరూ గౌరవించాలన్నారు. ఒకవేళ కోర్టు ఇచ్చే తీర్పు నచ్చకపోతే సుప్రీంకోర్టుకు వెళ్లొచ్చునని, ఆ అవకాశం కూడా ఉందని అన్నారు. వ్యవస్థలను ఎప్పుడూ దెబ్బతీయకూడదని ఆయన సూచించారు. శాసనసభ, న్యాయవ్యవస్థ, పత్రికా, మీడియా రంగం చాలా కీలకమైన వ్యవస్థలను వాటిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## జగన్‌ను ఎదుర్కొనే దమ్ము ఎవరికీ లేదు: మంత్రి కొడాలి

అమరావతి: ఏపీలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే వికేంద్రీకరణ అని మంత్రి కొడాలి నాని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ సీఎం జగన్‌ను ఎదుర్కొనే దమ్ము ఎవరికీ లేదన్నారు. వెన్నుపోటు రాజకీయాలు ముఖ్యమంత్రికి తెలియవన్నారు. సీఎంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌ను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదన్నారు. లోకేష్‌కు దమ్ముంటే తనపై గుడివాడలో పోటీ చేయాలని సవాల్ చేశారు. సొంత బాబాయ్ వివేకను చంపాల్సిన అవసరం జగన్‌కు ఏముందని ప్రశ్నించారు. నోరుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దన్నారు. కోర్టులపై అపారమైన గౌరవం ఉందని సీఎం జగన్ చెప్పారని మంత్రి కొడాలి నాని వ్యాఖ్యానించారు.



## యోగి ప్రమాణస్వీకారం

### : మంత్రివర్గంలో 52 మంది

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ శుక్రవారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. విజయవంతంగా ఐదేళ్ల పాలన పూర్తి చేసిన ఒక ముఖ్యమంత్రి వరుసగా రెండోసారి మళ్లీ ప్రభుత్వ పగ్గాలను చేపట్టడం గత 37 ఏళ్లలో ఇదే ప్రథమం. లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకనా స్టేడియంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీతో సహా కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, సాధుసంతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ చేత గవర్నర్ ఆనంది బెన్ పటేల్ ప్రమాణస్వీకారం చేయించారు. ఉప ముఖ్యమంత్రులుగా బ్రిజేష్ పాఠక్, కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రమాణ స్వీకారం చేశారు. యోగి ఆదిత్యనాథ్ 52 మందిని తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హర్యానా సీఎం ఎల్ఎల్ ఖట్టార్, హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరామ్ ఠాకూర్, ఆసోం సీఎం హిమాంత బిస్వా శర్మ, ఉత్తరాఖండ్ సీఎం



పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూ పేంద్ర పటేల్, మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ తదితరులు హాజరయ్యారు.మంత్రులు వీరే...క్యాబినెట్: కేశవ్ ప్రసాద్ మౌర్య (ఉప ముఖ్యమంత్రి), బ్రజేష్ పాఠక్ (ఉప ముఖ్యమంత్రి), సూర్య ప్రతాప్ షాహి, సురేష్ కుమార్ ఖన్నా, స్వతంత్ర దేవ్ సింగ్, బేబీ రాణి మౌర్య, లక్ష్మీనారాయణ చౌదరి, జయవీర్ సింగ్, ధర్మపాల్ సింగ్, నంద్ గోపాల్ గుప్తా, భూపేంద్ర సింగ్ చౌదరి, అనిల్ రాజ్‌భర్, జితిన్ ప్రసాద, రాకేష్ సచన్, అరవింద్ కుమార్ శర్మ, యోగేంద్ర ఉపాధ్యాయ్, ఆశిష్ పటేల్, సంజయ్ నిషద్.సహాయ మంత్రులు (ఇండిపెండెట్ చార్జి)నితిన్ అగర్వాల్, కపిల్ దేవ్ అగర్వాల్, రాజేంద్ర జైశ్వాల్, సందీప్ సింగ్, గులాబ్ దేవి, గిరీష్ చంద్ర యాదవ్, ధర్మవీర్ ప్రజాపతి, అసిం అరుణ్, జేపీఎస్ రాథోడ్, దయాశంకర్ సింగ్, నరేంద్ర కష్యప్, దినేష్ ప్రతాప్ సింగ్, అరుణ్ కుమార్ సక్సేనా, దయాశంకర్ మిశ్రా దయాళు.సహాయ మంత్రులుమయాంకేశ్వర్ సింగ్, దినేష్ ఖటీక్, సంజీవ్ గాండ్, బల్దేవ్ సింగ్ ఒలేఖ్, అజిత్ పాల్, జశ్వంత్ సైని, రాంకేష్ నిషద్, మనోహర్ లాల్ మన్ను కోరి, సంజయ్ గాంగ్వార్, బ్రిజేష్ సింగ్, కేపీ సింగ్, సురేష్ రహి, సోమేందర్ తోమర్, అనూప్ ప్రధాన్ వాల్మీకి, ప్రతిభా శుక్లా, రాకేష్ రాథోర్ గురు, రజనీ శర్మ, సతీష్ శర్మ, డానిష్ అజాద్ అన్సారీ, విజయ్ లక్ష్మీ గౌతమ్.


VISION BHARATH REPORTER
విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
MOBILE:
9494498787,9440232308.

# సంపాదకీయం

శనివారం 26 మార్చి 2022

## ఉక్రెయిన్ సంక్షోభం సామాన్యుడిపై భారం

ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలై నెలరోజులు కావస్తోంది. ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియదు. ఈ యుద్ధ ప్రభావం ప్రపంచ దేశాలపై కనిపించటం ప్రారంభమైంది. ముడి చమురు, ఇందన ధరలతో పాటు నిత్యావసరాలైన వంట నూనెలు, ప్యాక్డ్ ఐటెమ్స్, కూరగాయల ధరలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ముమ్ముందు ఈ ధరల భారంతో సామాన్యుడు మరింతగా కుదేలయ్యే ప్రమాదం ఏర్పడింది.కరోనా మహమ్మారి వల్ల ఇప్పటికే సామాన్యుడి జీవన శైలి ఘోరంగా దెబ్బతింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తీవ్ర ఒడుదుడుకులకు లోనయ్యాయి. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కుదుటపడుతున్నాయని బావిస్తున్న సమయంలో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగటం ప్రపంచానికి నిజంగానే పెద్ద షాక్. ఇంకా ఈ యుద్ధం ఎటువైపు దారితీస్తుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కొందరు ఏకంగా మూడో ప్రపంచ యుద్ధం వచ్చినా ఆశ్చర్యం లేదంటున్నారు.రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. ఇది ఆయిల్ దిగుమతి దేశాలకు శాపంగా పరిణమించింది. భారీగా ముడిచమురుని దిగుమతి చేసుకునే భారత్‌కి ఈ యుద్ధం పెద్ద షాక్. మూడు నెలల్లో ముడి చమురు ధర 50 శాతం పెరిగిందంటేనే దీని ప్రభావం ఎలా ఉందో అర్థమవుతుంది. ముందు ముందు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే చమురు సంస్థలు ఇంధన ధరలు పెంపునకు శ్రీకారం చుట్టాయి. ఫలితంగా బల్క్ ధరలతో పాటు రిటైల్ ధరలు కూడా పైపైకి పోతున్నాయి.అంతర్జాతీయ విఫణిలో బ్యారెల్ ముడి చమురు 110 డాలర్ల దాటింది. ఇంధన ధరల పెరుగుదలకు అనుగుణంగా దేశీయ వంట గ్యాస్ సిలిండర్ ధర వెయ్యి రూపాయలు దాటింది. అలాగే వాణిజ్య సిలిండర్ ధర రెండు వేల రూపాయలు దాటింది. యుద్ధ విరమణ చర్చల్లో పెద్దగా పురోగతి కనిపించకపోవటం కూడా ఈ పెరుగుదలకు ఒక కారణం. సంక్షోభం కొనసాగటం వల్ల చమురు సరఫరా వ్యవస్థల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక దేశాలు ప్రత్యామ్నాయ వనరుల వైపు చూస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ మధ్య చర్చలు ప్రారంభమైనప్పుడు త్వరలో యుద్ధం ఆగుతుందనే ఆశ కనిపించింది. కానీ నెలరోజులు గడుస్తున్నా చర్చల్లో పురోగతి లేదు. వార్‌కు ఇప్పుడప్పుడే ఫుల్ స్టాప్ పడదని తెలిసిపోయింది. దాంతో గతవారం 100 డాలర్ల దిగువన ఉన్న బ్యారెల్ ముడి చమురు ధర మళ్లీ పెరిగింది.చమురు ఇందన ధరలు ఇలా వుంటే వంటనూనె ధరలు కూడా ఆకాశాన్ని అంటున్నాయి. మన దేశంలో లీటర్ వంట నూనె రెండు వందల రూపాయలు దాటింది. పెట్రోల్, డిజిల్, వంటగ్యాస్ ధరల కూడా ప్రభుత్వం పెంచింది. ఈ యుద్ధం వల్ల వరుసగా మూడో ఏదాది కూడా సామాన్యుల ఆర్థిక పరిస్థితి బాగు పడే సూచనలు కనిపించడం లేదు.అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడానికి ఉక్రెయిన్ సంక్షోభాన్ని కారణంగా చూపుతున్నారు. అందులో కొంత మాత్రమే నిజం. అసలు కారణం ఆయిల్ ఉత్పత్తి చేసే దేశాల ధనకాంక్ష. ఉక్రెయిన్ మీద రష్యా యుద్ధాన్ని ప్రారంభిస్తే, అమెరికా రష్యాపై ఆంక్షలు విధిస్తుందని, అదే జరిగితే ముడిచమురు సరఫరాలో కొరత ఏర్పడుతుందన్న అంచనాల ఆధారంగా ప్రస్తుతం ధరలను పెంచుతు న్నారు .ముడి చమురు కోసం ప్రపంచం రష్యా మీదనే ఆధారపడి లేదు. పెట్రోలియం ఉత్పత్తిలో రష్యా కన్నా అమెరికా, సౌదీ అరేబియాలు ముందున్నాయి. కనుక ఈ సంక్షోభం వల్ల చమురు సమస్యలు ఏర్పడితే ఇతర దేశాలు తమ సరఫాలను పెంచవచ్చు.రోజుకునాలుగులక్షలబ్యారెళ్లకు అదనంగా ఒక్క బ్యారెల్‌ను కూడా ఉత్పత్తి చేయబోమని ప్రకటించాయి. నిజానికి బ్యారెల్ ధరను వంద డాలర్లకు చేర్చాలని ఈ దేశాలు చాలా రోజులుగా నుండో డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుత సంక్షోభాన్ని చక్కగా ఉపయోగించుకున్నాయి. తాజా ధరల పెరుగుదలకు ఈ సంక్షోభమే కారణం అనుకుంటే.. రేపు సాధారణ పరిస్థితులు ఏర్పడిన తరువాత ఆ దేశాలు ధరలు తగ్గిస్తాయా? అలా ఎప్పటికీ జరగకపోవచ్చు.

## మూడు రాజధానుల భ్రమ...

విజయవాడ, మార్చి 25, వైసీపీ నేతలు, జగన్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంకా మూడు రాజధానుల భ్రమల్లోనే ఉన్నారనిపిస్తోంది. వందలాది రోజుల పాటు రాజధాని ప్రాంతం రైతులు, మహిళా రైతులు చేసిన ఉద్యమం, హైకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు అనంతరం కూడా వారు ఇంకా అదే భ్రమల్లో ఉండిపోయారనే వ్యాఖ్యలు వస్తున్నాయి. పైగా నాలుగైదు వందల ఏళ్ల నుంచి నగరాలను అభివృద్ధి చేస్తే.. చంద్రబాబు మాత్రం నాలుగైదేళ్లలోనే అమరావతి నగరాన్ని కట్టేయాలనే భ్రమపడ్డారంటూ అసెంబ్లీ వేదికగా సీఎం జగన్, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అనడాన్ని ఏమనుకోవాలి భ్రమ అని కాక? అని అందరూ అనుకుంటున్నారు. ఏపీలో అభివృద్ధి వికేంద్రీకరణ అంశంపై సభలో జరిగిన చర్చ సందర్భంగా ఆర్థిక, శాసన వ్యవహారాల మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు మాట్లాడిన మాటల తీరుపై విమర్శలు వస్తున్నాయి.కోర్టు మొట్టికాయలు వేసినా వైసీపీ ప్రభుత్వం ఇంకా మూడు రాజధానుల బిల్లుకే కట్టుబడి ఉందంటూ సీఎం జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. ఏపీలో అమరావతినే రాజధానిగా కొనసాగించాలని హైకోర్టు తీర్పు చెప్పినా.. అమరావతిలోనే రాజధాని అంటూ భవనాల నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించినా ఇంకా మూడు రాజధానులంటూ మాట్లాడడం తగదని అంటున్నారు. రాజధాని ఎక్కడ ఉండాలనే దానిపై రాష్ట్ర శాసనసభకు అధికారం లేదని హైకోర్టు చెప్పడం సరికాదంటూ సీఎం జగన్ రెడ్డి అనడం ఏంటనే ఆగ్రహం వ్యక్తం అవుతోంది. సీఎం జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే ధర్మాన మాట్లాడిన తీరు చూస్తుంటే.. 'అయిపోయిన పెళ్లికి బాజా వాయించినట్లు' ఉందంటున్నారు.వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి కోసమే తమ ప్రభుత్వం వికేంద్రీకరణ నినాదం ఎత్తుకుందని మంత్రి బుగ్గన చెప్పడంలోని ఔచిత్యాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. పనిలో పనిగా ఒకరి హక్కును మరొకరు లాక్కోకూడదంటూ న్యాయ వ్యవస్థపైనా మంత్రి బుగ్గన వ్యాఖ్యానించడాన్ని తప్పుపడుతున్నారు. ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించి, సమానత్వం సాధించేందుకే తాము మూడు రాజధానుల మంత్రం జపిస్తున్నామంటున్నారు. అంటే రాజధాని ప్రాంతం కాకపోతే అభివృద్ధి జరగదనా..? లేక అభివృద్ధి చేయబోమనేది మంత్రిగారి ఉద్దేశమా? అని నిలదీస్తున్నారు.ఇక.. చట్టాలకు రూపకల్పన చేసే బాధ్యత జాతీయ స్థాయిలో పార్లమెంటుకు, రాష్ట్ర స్థాయిలో అసెంబ్లీకి మాత్రమే ఉందంటూ ఇదే చర్చలో మాట్లాడిన వైసీపీ ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు చెప్పుకొచ్చారు. అంటే శాసన వ్యవస్థలో న్యాయవ్యవస్థ వేలు పెట్టడం ఏంటనేది ఆయన పాయింట్ ఆఫ్ ఆర్డర్ గా ఉంది. ఒక పక్కన కేంద్రం, మరో పక్కన న్యాయస్థానం అమరావతే రాజధాని అని తేల్చే చెప్పిన తర్వాత కూడా బరితెగించి మరీ ఇలా మూడు రాజధానులంటూ మాట్లాడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న జనం నుంచి వస్తోంది. పైగా ఒక వ్యవస్థను మరో వ్యవస్థ పలుచన చేస్తోందనేది ధర్మానవారి ధర్మ ప్రవచనం. ఒక పక్కన రైతులు, మరో పక్కన కేంద్రం, ఇంకో వైపున కోర్టు తెగేసి చెబుతున్నా మొండిగా మూడు రాజధానులు అంటున్న వైసీపీ నేతలను ఏమనాలి అంటున్నారు. 'రాజు కంటే మొండివాడు బలవంతుడు' అనే సామెతను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నారు. ఒక పక్కన కోర్టులంటే గౌరవం ఉందంటున్న ధర్మాన మరో పక్కన కోర్టు తీర్పుపై వ్యాఖ్యలు చేయడంపై జనంలో ఆగ్రహం వ్యక్తం అవుతుండడం గమనార్హం.

బాబు ఆగ్రహం

ఏపీలో మళ్లీ మూడు ముక్కలాటకు తెరతీశారని టీడీపీ అధినేత చంద్రబాబుఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్‌పై విషం చిమ్ముతున్నారని విమర్శలు గుప్పించారు. భావితరాల భవిష్యత్‌పై ఇంత కక్ష పూరితంగా వ్యవహరించడం దుర్మార్గం అని అన్నారు. రాజధానిపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే అధికారం లేదన్నారు. ప్రజలను చంపేస్తామని చట్టం చేయలేరని అన్నారు. అమరాతి గురించి మాట్లాడే హక్కు ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఆ రోజు అమరావతి రాజధానికి అంగీకారం తెలిపారని గుర్తుచేశారు. శాసనసభలో చట్టాలు చేయాలి కానీ జనాల ప్రాణాలు తీసే చట్టం చేస్తామంటే కోర్టులు ఊరుకోవని మండిపడ్డారు. అధికార వికేంద్రీకరణకు, అభివృద్ధి వికేంద్రీకరణకు తేడా తెలీని వాళ్లు శాసనసభ్యులుగా ఉన్నారన్న మండిపడ్డారు. ప్రజలకు కావల్సింది అభివృద్ధి వికేంద్రీకరణ అని అన్నారు. శాసనసభలో వైసీపీ ప్రభుత్వం మళ్లీ మూడు ముక్కలాటకు శ్రీకారం చుట్టటం దుర్మార్గమని ధ్వజమెత్తారు.భావితరాల భవిష్యత్తుపై ఇంత కక్షగా వ్యవహరించటం దురదృష్టకరమని మండిపడ్డారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానాలకు వెళ్లకుండా మొండిగా వితండవాదం చేయటమేంటని ప్రశ్నించారు. ప్రజలు అధికారం కట్టబెట్టింది విధ్వంసం చేయటానికి కాదన్న చంద్రబాబు.., అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు ముఖ్యమంత్రి జగన్?కు లేదన్నారు. చేతనైతే రాజధాని అమరావతి అంశంపై ప్రభుత్వాన్ని రద్దు చేసి ప్రజాభిప్రాయం కోరాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు.ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులు జోక్యం చేసుకోవా..? అని చంద్రబాబు ప్రశ్నించారు. రాజధాని నిర్ణయించిన తరువాత తప్పనిసరిగా కేంద్రం అనుమతి తీసుకోవాలని అన్నారు. న్యాయ సూత్రాలకు అనుగుణంగా చట్టాలను చేయాలన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో రియల్ ఎస్టేట్ ఏంటి..? అని అడిగారు. ఇష్టానుసారం అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని సమస్యలను సృష్టిస్తున్నారని.. అందరూ కాళ్ల బేరానికి రావాలనుంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం విశ్వసనీయత పోగొట్టుకునేలా ప్రవర్తిస్తోందని.. భూములు ఇచ్చిన రైతులపైనే దాడులు చేశారని మండిపడ్డారు.

## పొత్తులపై మైండ్ గేమ్

కర్నూలు, మార్చి 25, ఎన్నికల పొత్తుల రాజకీయంలో మళ్లీ టీడీపీకి దగ్గరయిపోతామేమో అని కంగారు పడుతున్న వైసీపీలోని ప్రో వైసీపీ లీడర్స్ ఒక్క సారిగా యాక్టివ్‌గా మారిపోయారు. బీజేపీ నుంచి ఎలాంటి పొత్తు ప్రతిపాదనలు లేకపోయినా.. మూకుమ్మడిగా టీడీపీతో పొత్తు వద్దంటూ హైకమాండ్‌కు తీర్మానాలు చేసి పంపేస్తున్నారు. కర్నూలులో రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. ఇందులో పదమూడుజిల్లాల అధ్యక్షుల నుంచి టీడీపీతో పొత్తు వద్దన్న లేఖలు తీసుకున్నారు. ఈ అభిప్రాయాలను హైకమాండ్‌కు పంపనున్నారు. బీజేపీతో పొత్తు లేకుండా చంద్రబాబు అధికారంలోకి రాలేరని.. అందుకే టీడీపీతో పొత్తు పెట్టుకోకూడదనేది బీజేపీ నేతల తొలి మాట. బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తిరిగి బిజెపికే వెన్నుపోటు పొడుస్తున్నారని బీజేపీ నతేలు చెబుతున్నారు. పొత్తులపై 'మైండ్‌గేమ్' ఆడుతున్నారని బీజేపీ నేతలు చెబుతున్నారు. జాతీయపార్టీగా ఉన్న బిజెపి రాష్ట్రంలో కనీసం ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే స్థానాన్ని కూడా గెలవలేకపోతున్నామని అందుకే సంస్థాగతంగా బలోపేతం కావాలని వారు నిర్ణయించుకున్నారు. బీజేపీ నేతల అభిప్రాయాలు ప్రకారం వైసీపీ గెల్చినా పర్వాలేదు కానీ.. టీడీపీ గెలవకూడదన్నది వారి సిద్ధాంతంగా పెట్టుకున్నట్లుగా కనిపిస్తోంది. సోము వీర్రాజు ఎక్కడ ఏ మీటింగ్ పెట్టినా టీడీపీతో పొత్తుల గురించే మాట్లాడుతున్నారు. టీడీపీ కూడా బీజేపీతో పొత్తు గురించి మాట్లాడటం లేదు. జనసేనతో పొత్తు గురించే మాట్లాడుతోంది. బీజేపీకి ఒక్క శాతం ఓటు బ్యాంక్ కూడా లేదు. పైగా ఆ పార్టీ మీద ప్రజల్లో కనీసం ఓ అభిప్రాయం కూడా లేదు. అయినా వారు టీడీపీ ఎందుకు పొత్తు కోసం ప్రయత్నిస్తుందో చెప్పుకోలేకపోతున్నారు. ఒక్క శాతానికన్నా దిగువకు ఓట్ల శాతం ఉన్న బీజేపీ అండగా టీడీపీ ఎలా గెలుస్తుందో వారు చెప్పాల్సి ఉంది. అది చెప్పకుండా.. టీడీపీతో పొత్తుపై వారంతటికి వారే చెలరేగిపోతే.. అది ప్రజల్లో తప్పుడు సంకేతాలను పంపుతుంది మరి

## సైలెంట్ గా జేసీ బ్రదర్స్



అనంతపురం, మార్చి 25, రాజకీయ నేతలు ఎప్పుడూ యాక్టివ్ గానే ఉండాలి. అయితే హైపవర్ యాక్టివ్ గా ఉండకూడదు. చేయి, నోరు అదుపులో ఉండాలి. ఈ రెండు అదుపులో ఉండని నేతలు ఎవరైనా ఉన్నారా? అంటే వాళ్లే జేసీ బ్రదర్స్. ఇద్దరూ తమ నోటికి ఎప్పుడూ పనిచెబుతుంటారు. వివాదాలకు అడ్రస్ గా నిలుస్తుంటారు. కానీ కొంతకాలంగా జేసీ దివాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలు కొంత మౌనంగానే ఉంటున్నారు. వైసీపీ ప్రభుత్వానికి భయపడి మాత్రం కాదు. టీడీపీ పై అసంతృప్తి వల్లనేనట.జేసీ బ్రదర్స్ జిల్లాపై పెత్తనం కోరుకుంటారు. వారు ఏ పార్టీలో ఉన్నా అనంతపురం జిల్లాలో తమ మాటే చెల్లుబాటు కావాలనుకుంటారు. ముఖ్యంగా తమకు ప్రాబల్యం ఉన్న తాడిపత్రి, అనంతపురం టౌన్, శింగనమల, పుట్టపర్తి, కల్యాణదుర్గం వంటి నియోజకవర్గాల్లో తమ మార్క్ ను చూపించాలని వారు భావిస్తుంటారు. అక్కడ తమకంటూ ప్రత్యేకమైన ఓటు బ్యాంకు ఉందని, తమను అభిమానించే క్యాడర్ ఉందని నమ్ముతారు. హద్దులు గీసి... అందుకే జేసీ బ్రదర్స్ ఈ నియోజకవర్గాల్లో తరచూ పర్యటిస్తూ కొంత హడావిడి చేస్తుంటారు. తాడిపత్రిలో మరో నేత పార్టీ నుంచి అడుగుపెట్టడానికి కూడా అనుమతించని జేసీ బ్రదర్స్ మిగిలిన నియోజకవర్గాల్లో మాత్రం అక్కడి టీడీపీ నేతలకు చెప్పకుండానే వెళ్లి వస్తుంటారు. అయితే టీడీపీ అధినాయకత్వం గట్టి ఆదేశాలు జారీ చేసింది. లోకల్ నాయకత్వం సమ్మతి లేకుండా ఒకరి నియోజకవర్గంలో మరొకరు పర్యటించడానికి వీల్లేదని చెప్పింది. జేసీ బ్రదర్స్ కు కూడా హద్దులు గీసింది. అయితే దీనిని జేసీ బ్రదర్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీని బలోపేతం చేయడం కోసం తాము ప్రయత్నిస్తుంటే తమపై పార్టీలోని ఒకవర్గం దుష్ప్రచారం చేస్తుందని వారు చెబుతున్నారు. జిల్లా కమిటీల్లోనూ జేసీ వర్గానికి అధినాయకత్వం మొండి చేయి చూపింది. దీంతో చంద్రబాబు వద్దనే తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. అయితే చంద్రబాబు పిలిస్తేనే తాము వెళ్లాలని జేసీ ప్రభాకర్ రెడ్డి భావిస్తున్నారు. తమంతట తాముగా హైకమాండ్ వద్దకు వెళ్లవద్దని, అధినేత పిలిస్తేనే వెళ్లాలన్నది జేసీ బ్రదర్స్ ఆలోచనగా ఉంది. అందుకే అప్పటి వరకూ మౌనంగా ఉండాలని జేసీ బ్రదర్స్ నిర్ణయించుకున్నారని తెలుస్తోంది.

## శ్రీశైల ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

శ్రీశైలం శ్రీశైల దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ధర్మకర్తలమండలిని నియామకం చేసింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం జి.ఓ. ఆర్టినెం. 202, తేది: 24.03.2022 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. తదనుగుణంగా దేవదాయశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు అనుసరించి నూతన ధర్మకర్తలి మండలి చేత శుక్రవారం రోజు ఉదయం కార్యనిర్వహ ణాధికారి ఎస్. లవన్న పదవి ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. దేవస్థాన పరిపాలనా కార్యాలయ భవనములోని సమావేశమందిరములో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమములో సభ్యులందరిని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ముందుగా స్వాగతించారు.అనంతరం ధర్మకర్తల మండలి సభ్యులుగా రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీమఠం విరూపాక్షయ్యస్వామి. జంగం సుజాతమ్మ, గురు మహంత్ మహేష్, జి.నరసింహారెడ్డి. జి.ఎస్.విజయలక్ష్మి బి. రామేశ్వరి. ఎ. లక్ష్మి సావిత్రమ్మ. అలగుంతగిరి మురళి, మేడాబోత్ హనుమంతనాయక్, మధుసూదన్ రెడ్డి, ఖరుగురెడ్డి పద్మజ, మనిశెట్టి మాధులత, డా. కనకదుర్గ చే ప్రమాణస్వీకారం చేయించారు. తరువాత ధర్మకర్తల మండలిలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా స్వామివారి ప్రధానార్చకులు జె. వీరభద్రయ్యస్వామి వారిచేత కూడా ప్రమాణస్వీకారం చేయించడం జరిగింది. కాగా గవర్నమెంట్ మెమో ద్వారా ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా నియామకం కాబడిన తన్నీరు ధర్మరాజు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి కూడా ఈ కార్యక్రమానికి విచ్చేయడం జరిగింది. ధర్మకర్తల మండలి అధ్యక్ష ఎన్నిక ప్రమాణస్వీకారం సభ్యులందరూ కూడా రెడ్డివారి చక్రపాణిరెడ్డిని ఏకగ్రీవంగాధర్మకర్తల మండలి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. కార్యక్రమం చివరిలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు పలువురు సభ్యులు మాట్లాడుతూ.దేవస్థానం అభివృద్ధి మరియు భక్తుల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.తరువాత ధర్మకర్తల మండలి అధ్యక్షులకు మరియు సభ్యులకు కార్యనిర్వహణాధికారివారు. శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనాలను చేయించారు.అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల నిత్యకల్యాణమండపంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు సభ్యులందరికీ వేదాశీర్వచనముతో శేషవస్త్రాలు, ప్రసాదాలు మరియు జ్ఞాపిక అందజేయబడ్డాయి.

## అదిగో..అల్లదిగో...యాదాద్రి

### సోమవారం నుంచి దర్శనాలు



నల్గొండ, మార్చి 25, (న్యూస్ పల్స్)పాలకులు ఏదైనా మంచి పని చేస్తే అది కొన్నేళ్ల పాటు ప్రజలకు గుర్తుండిపోవాలి. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసిన యాదాద్రి ఆలయ పునరుద్ధరణ అలాంటిదే. గుట్టపై నూతనంగా వెలసిన ఆలయ నిర్మాణాలు శాశ్వతంగా నిలిచిపోతాయి. ఈ మహాకార్యాన్ని నిజం చేసిన సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరు కూడా జన హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోతుంది.ఇప్పుడు యాదాద్రి అందాలను చూస్తే మైమరచిపోకుండా ఉండలేరు. అంత రమ్యంగా తీర్చిదిద్దారు యాదగిరి నరసింహుని సన్నిధిని. ఎక్కడా రాజీ పడకుండా, ఏలాంటి తొందర, ఆత్ర లేకుంగా కావాల్సినంత సమయం తీసుకుని దీక్షగా తీర్చి దిద్దారు. ఆగమ శాస్త్ర నియమాలను అనుసరించి అన్ని నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అత్యంత పకడ్బందీగా నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆలయ గోపురాలు, మాడవీధులు, ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజ స్థంభం, శివాలయం, క్యూలైన్లు, ప్రసాదం వంటశాల, పుష్కరిణీ, యాగశాల ఇలా దేనిని చూసినా అడుగడుగునా ఆధ్యాత్మికత, ధార్మికత ఉట్టిపడుతుంది.యాదగిరిగుట్ట గొప్ప సనాతన ఆలయం. దేశ విదేశాల్లో స్వామి వారికి లక్షలాది మంది భక్తులున్నారు. ప్రతి నిత్యం వేలాది మంది నరసింహుని దర్శించి మొక్కులు చెల్లిస్తారు. పునరుద్ధరణ తరువాత యాదాద్రి భక్తుల సంఖ్య ఇప్పటికన్నా రెట్టింపు అవుతుందని అంచనా. కనుక దైవ దర్శనం నుంచి వసతి సౌకర్యం, పుణ్య స్నానాలు, తలనీలాల సమర్పణ..ఇలా అన్ని విషయాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు.రాతి శిలలను శిల్పులు అద్భుత కళాకండాలుగా మలిచారు. ఆలయ ప్రాంగణమంతా దేవతామూర్తుల విగ్రహాలతో నిండే విధంగా రూపకల్పన చేశారు. 560 మంది శిల్పులు ఏళ్ల నాటి కష్టం ఫలించి అద్భుత ఆకారాలతో కూడిన ఈ ప్రాకారాలు సిద్ధమయ్యాయి. వందకు వంద శాతం శిలలనే ఉపయోగించి దేవాలయాన్ని తీర్చిదిద్దడం యాదాద్రిలోనే సాధ్యమయింది. ఆలయ ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా, ఆహ్లాదం పంచేలా ఉద్యానవనాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో దేవాలయ ప్రాశస్త్యం, లక్ష్మీ నర్సింహస్వామి చరిత్ర, స్థలపురాణం ప్రస్ఫుటించే విధంగా తైల వర్ణ చిత్రాలు ఏర్పాటు చేశారు.విశిష్టాలయానికి ప్రతిదినం ప్రముఖులు వస్తూ వుంటారు. ప్రత్యేక దినాలలో వీఐపీలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అందుకే సకల సౌకర్యాలతో కూడిన 15 వివిఐపి కాటేజీలతో ప్రెసిడెన్షియల్ సూట్ ను నిర్మించారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి లాంటి వారు వచ్చినా వారికి సౌకర్యవంతంగా వుండేట్లు ఈ ప్రెసిడెన్షియల్ సూట్లను ఏర్పాటు చేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 2016 ఏప్రిల్‌లో అప్పటి వరకు ఉన్న ఈ గుట్ట గుడితో పాటు దేవాలయానికి అనుసంధానమైన అన్ని నిర్మాణాలను తొలగించారు. అలాగే గుట్ట చుట్టూ ఆనుకుని ఉన్న అన్ని ప్రైవేటు స్థలాలనూ, గృహ నిర్మాణాలను కూడా తొలగించారు. పూర్తి నల్లరాతితో యాదాద్రి పునర్నిర్మాణం జరిగింది. తెలంగాణా తిరుపతిగా పిలుచుకునే ఈ యాదగిరిగుట్ట ప్రపంచవ్యాప్తంగా యాదాద్రిగా నేడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే యాదాద్రి కొత్త వెలుగును చూసేందుకు సెలవు దినాలలో సందర్శకులు పోటెత్తుతున్నారు.యావత్ దేశం అబ్బురపడేలా యాదాద్రిని మలచేందుకు తెలంగాణ ప్రభుత్వం దాదాపు రెండు వేల కోట్లు ఖర్చు చేసింది. వంద కోట్లతో 1900 ఎకరాల భూమిని సేకరించింది. ఆలయ అభివృద్ధికి రూ.509 కోట్లు, టెంపుల్ సిటీ అభివృద్ధికి రూ. 1325 కోట్లు ఖర్చు చేసింది. ఆలయ నిర్మాణంతో పాటు టెంపుల్ సిటీ అభివృద్ధి, మంచినీటి వసతి, కాటేజీల నిర్మాణం, రహదారులు, సరస్సులు, ఉద్యానవనాలు, అభయారణ్యాలు, నిత్యాన్నదాన సత్రాలు, కల్యాణ మండపాలు, వేద పాఠశాల, శిల్పనిర్మాణ సంస్థ ఏర్పాటు వంటివి ఏర్పాటయ్యాయి. యాదాద్రిని పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు సమీపంలో నాలుగు సరస్సులను అభివృద్ధి చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం.దాదాపు ఏడేళ్ల క్రితం యాదాద్రి అభివృద్ధి అంశం తెరమీదకు వచ్చింద. నాటి నుంచి ఆ ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి.

## నమ్మకంతో తెలుగు తమ్ముళ్లు

విజయవాడ, మార్చి 25, 2019 ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందనుకున్నారు అందరూ. 23 స్థానాలను సాధించడంతో ఇక పార్టీ కోలుకోలేదని భావించారు. ఇక నలుగురు ఎమ్మెల్యేలు పార్టీ నుంచి తప్పుకోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. గెలిచిన 23 మందిలో చివరకు మిగిలేది బావ, బామ్మర్ది అన్న సెటైర్లు కూడా రాజకీయంగా వినిపించాయి. కానీ చంద్రబాబు మీద పార్టీ నేతలకు నమ్మకం ఎక్కడా ఏమాత్రం సన్నగిల్లలేదని స్పష్టమయింది. జగన్ స్టేట్ మెంట్ తో... 2019 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్ తాను ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను తీసుకోనని, ఒకవేళ వస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రావాలని జగన్ అసెంబ్లీలోనే చెప్పారు. దీంతో టీడీపీకి పెద్ద రిలీఫ్ దక్కినట్లయింది. అయినా కరణం బలరాం, వల్లభనేని వంశీ, మద్దాలిగిరి, వాసుపల్లి గణేష్ కుమార్ లు వైసీపీకి మద్దతుదారులుగా మారారు. పార్టీలో వీరు నేరుగా చేరకుండా టీడీపీకి దూరంగా, వైసీపీకి దగ్గరగా ఉన్నారు. దీంతో మరికొంత మంది ఎమ్మెల్యేలు కూడా జగన్ వైపు వెళతారన్న ప్రచారం జరిగింది. చంద్రబాబు ప్రతిపక్ష హోదా కూడా పోతుందన్న వారు కూడా లేకపోలేదు. గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, గణబాబు వంటి వారు కూడా పార్టీ నుంచి వెళ్లిపోతారని భావించారు. గంటా శ్రీనివాసరావు టీడీపీకి దూరంగా ఉన్నా ఆయన ఏపార్టీలో చేరలేదు. అయితే ఇప్పటి వరకూ నలుగురు తప్ప మరెవ్వరూ పార్టీని వీడలేదు. ఇక ఛాన్స్ లేదు.... ఇక ఎన్నికలకు రెండేళ్లు మాత్రమే సమయం ఉంది. ఈ రెండేళ్లలో పార్టీ నుంచి వెళ్లిపోయే ఎమ్మెల్యేలు ఉండరనే చెప్పాలి. వచ్చే ఎన్నికల్లో తిరిగి తమకు టీడీపీ లో టిక్కెట్ ఖాయమని, మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకం వారిలో ఉండటమే అందుకు కారణం.

# కనుమరుగుతున్న ఒంగోలు గిత్త

ఒంగోలు, మార్చి 25,చక్కని శరీర సౌష్ఠవం.. చూపు తిప్పుకోలేని అందం.. నడకలో రాజసం.. వీటన్నిటి మించి అబ్బురపరిచే తెలివితేటలు.. ఒంగోలు జాతి గిత్తలకు పుట్టుకతో లభించిన వరం. పశువుల జాతిలో ఏ జాతికి లేని లక్షణాలు, ప్రత్యేకతలు ఒంగోలు జాతి గిత్తల సొంతం. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి అపురూప లక్షణాలున్న జాతి పశువుల జాడ ఇంత వరకు లభించలేదు. బండలాగుడు పోటీలు, పశువుల అందాల పోటీలు ఎక్కడ జరిగినా ఒంగోలు జాతి ఎద్దుల ముందు ఎంతటి పశు జాతైనా బలాదూరు కావాల్సిందే.. అయితే ప్రస్తుతం ఒంగోలు జాతి గిత్తల పరిస్థితి పూలమ్మిన చోటే కట్టెలమ్మాల్సిన దుస్థితిలా తయారైంది. వీటి పోషణ భారంగా మారడంతో పెద్ద రైతులు తప్ప సామాన్య రైతులు వీటిని పోషించలేక పోతున్నారు. వీటి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పశు సంరక్షణ కేంద్రాల్లో నిధుల లేమితో తిండి, నీరు లేక పశువులు బక్క చిక్కిపోతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒంగోలు జాతి గిత్తల అభివృద్ధి కోసం వట్టి మాటలు కట్టిపెట్టి ఇకనైనా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందంటున్నారు పశు పోషకులు.క్రీస్తు పూర్వం సుమారు 4 వేల సంవత్సరాల క్రితం ఒంగోలు సమీపంలో ఓ అపురూపమైన జాతి పశువుల జాడ వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఇరాన్ దేశంగా ఉన్న ఆర్యావర్తనం నుంచి వచ్చినవారితో కలిసి మధ్య ప్రదేశ్, హర్యానా మీదుగా ఒంగోలుకు ఈ గిత్తలు వచ్చినట్టు చరిత్ర పరిశోధకులు చెబుతారు. ఆ జాతే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒంగోలు జాతి గిత్తలుగా అవతరించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన పాలేరు, ఉత్తరాన గుండ్లకమ్మ , పడమర ముసి నదులు ఉన్నాయి. వీటి మధ్య ప్రాంతాన్ని ఒంగోలు ట్రాక్ అంటారు. ఈ ట్రాక్‌లో కరవది, ఉలిచి, నాగులుప్పలపాడు, చేకూరపాడు, దొడ్డవరప్పాడు, టంగుటూరు, కారుమంచి, కామేపల్లి ముఖ్య గ్రామాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో జొన్న చొప్పను రైతులు అధికంగా పండించేవారు. ఇక్కడి నేలల్లో సున్నం, భాస్వరం, ఇతర ఖనిజ లవణాలు అధికంగా ఉంటాయి. ఈ నేలల్లో పండిన మొక్కలను ఎక్కువగా ఆహారంగా తీసుకునే ఈ జాతి పశువులు మంచి ఎముక పుష్టి కలిగి ఏపుగా ఎదిగాయి. ఆహారం, వాతావరణం, భూసారం అనుకూలించడంతో ఎంతటి ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకుని నిలబడగలిగే రోగ నిరోధక శక్తి ఈ జాతి పశువులకు లభించింది. పాల ఉత్పత్తి, బరువులు లాగడంతో ఈ జాతి పశువులు ప్రపంచంలో మరో జాతి పోటీ పడలేదు. వీటి సామర్థ్యాన్ని పసిగట్టిన ఆనాటి రైతులు వీటిని వ్యవసాయానికి ప్రధాన సాధనంగా వినియోగించారు.



వ్యవసాయం చేయడంలో ఒంగోలు జాతి గిత్తలు మంచి పేరు సంపాదించడంతో వేల సంవత్సరాలుగా ఈ జాతి ఎద్దులు రైతుల బంధువులుగా మారిపోయాయి.వీటికి తెలివితేటలు కూడా ఎక్కువే. యజమాని అభీష్టాన్ని బట్టి నడుచుకోవడం వీటి ప్రత్యేకత. వీటికి సెంటిమెంటు కూడా ఎక్కువే. యజమాని పట్టించుకోకుంటే ఇవి దిగులు పెట్టుకుంటాయి. ఆహారం తీసుకోకుండా మారాం చేస్తాయి. యజమాని కాలం చెందితే, దిగులుతో ఆహారం స్వీకరించకుండా ఆత్మత్యాగం చేసే విశ్వాసం ఒంగోలు జాతి గిత్తది. దీంతో వీటిని పసి పిల్లలతో సమానంగా చూసుకుంటారు రైతులు. ప్రతిక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటూ కడుపునిండా దాణా పెడతారు. తిండికి తగ్గట్టుగా ఇవి వ్యవసాయ పనుల్లో చురుగ్గా పాల్గొని రైతులకు మంచి పంట దిగుబడి వచ్చేలా సహకరిస్తాయి. దీంతో ఈ జాతి పశువులు వ్యవసాయంలో మేటిగా నలిచాయి. ఒంగోలు జాతి ఎద్దులు మన దేశంలో కంటే ఇతర దేశాల్లో ఎక్కువగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాయి. ఈ జాతి ఎద్దులను ఇతర దేశాలకు చెందిన రైతులు లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. బ్రెజిల్, ఆస్ట్రేలియా, అమెరికా, మెక్సికో, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, కొలంబియా దేశాలు వీటిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఒంగోలు జాతి గిత్తల సంఖ్య 15 కోట్లు ఉంటుందని అంచనా.. అయితే మన దేశంలో వీటి సంఖ్య గణనీయంగా పడిపోయింది. పుట్టి పెరిగిన ఒంగోలు పరిసర ప్రాంతాల్లో వీటి సంఖ్య వేలల్లోనే ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

వీటి పెంపకం, నిర్వహణ ఖర్చులు అధికం కావడంతో సామాన్య రైతులు వీటికి దూరంగా ఉంటున్నారు. పాత రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు ఉండటం వల్ల వ్యవసాయం కోసం రైతులు ఎక్కువగా ఒంగోలు జాతి పశువులపై ఆధారపడే వారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేనందువల్ల సన్న, చిన్నకారు రైతులు వీటిని పోషంచలేక పోతున్నారని పశు సంవర్ధక శాఖ అధికారులే ఒప్పుకుంటున్నారు. ఈ జాతి అభివృద్ధిపైనే అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్ మనుగడ ఆధారపడి ఉండేది.ఎద్దుల పోటీల్లోనే కాదు, సినిమాల్లో కూడా ఒంగోలు జాతి గిత్తలు ప్రత్యేక పాత్రలు పోషించిన సందర్భాలు ఉన్నాయి. ఎన్టీఆర్ నటించిన పెత్తందార్లు, కృష్ణ నటించిన పాడి పంటలు సినిమాలు? తాజాగా బాలకృష్ణ నటించిన అఖండ సినిమాలో కూడా నటించాయి అనేకంటే జీవించాయి అనవచ్చు? ఇలా, చాల సినిమాల్లో ఈ ఒంగోలు జాతి ఎద్దులను ప్రత్యేకంగా చూపించారు. వీటి తెలివితేటల్ని, బలాన్ని, అందాలను సిల్వర్ స్క్రీన్‌పై చూసిన ప్రేక్షకులు అబ్బురపడి ఆ సినిమాల్ని సూపర్ హిట్‌లు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈ జాతి ఎద్దుల పోషణ తలకు మించిన భారంగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కేవలం కొంతమంది డబ్బున్న రైతులు స్టేటస్ సింబల్‌గా పెంచుతున్నారే కానీ, వీటి పెంపకం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందంటున్నారు. వీటిని పోటీల్లో ప్రదర్శించి, అవి గెలిస్తే గర్వపడి మానసిక సంతృప్తిని పొందుతారు రైతులు. సంక్రాంతి సంబరాల్లో ఒంగోలు జాతి ఎద్దుల పోటీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం ఈ జాతి పశువులను అభివృద్ధి చేయడానికేనంటారు రైతులు. మరోవైపు ఈ పోటీల నేపథ్యంలో గిత్తలను కొట్టి హింసిస్తున్నారంటూ కొంతమంది జంతు ప్రేమికులు కోర్టులను ఆశ్రయించిన సందర్భాలూ ఉన్నాయి. అయితే కన్న బిడ్డల కంటే ఎక్కువగా ప్రేమించే ఈ ఒంగోలు జాతి ఎద్దులను రైతులు కొట్టరని, కేవలం పోటీల్లో ఉత్సాహంగా పరుగులు తారని చెబుతారు. ఇలాంటి పందేల్లో పాల్గొనే రైతులకు వచ్చే ఆనందం కోటి రూపాయలు డబ్బులు ఇచ్చినా కలగదంటారు.మనదేశంలోని పశు సంపదలో ఒంగోలు జాతికి విశిష్ట స్థానం ఉంది. ఇతర అన్ని జాతుల కన్నా ఈ జాతి బలిష్ఠంగా ఉంటుంది. ఒంగోలు జాతి ఎద్దులు ఎంతటి భారాన్ని అయినా అలవోకగా మోయడంతో పాటు సేద్యానికి బాగా ఉపకరిస్తాయి. అందువల్లనే మెట్ట భూములు అధికంగా ఉండే జిల్లా రైతాంగం వ్యవసాయానికి ఈ జాతి ఎద్దులను ఉపయోగించేవారు. ఒంగోలు జాతి ఆవులు కూడా ఎక్కువ పాలు ఇస్తాయి.

## టీటీడీ కి రూ కోటి విరాళం

**- ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి డిడి అందజేసిన దుబాయ్ భక్తుడు**

తిరుమల మార్చి 25దుబాయ్ లో నివాసం ఉంటున్న చార్టెడ్ అకౌంటెంట్ ఎం. హనుమంత కుమార్ శుక్రవారం టీటీడీ కి రూ కోటి విరాళంగా అందించారు. తిరుమల లోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి కి ఈ మేరకు డిడి అందజేశారు. టీటీడీ అభీష్టం మేరకు ఈ సొమ్ము ఏ ట్రస్ట్ కైనా జమచేసుకోవాలని దాత కోరారు.గో సంరక్షణ ట్రస్ట్ కు రూ 10 లక్షల విరాళం టీటీడీ గో సంరక్షణ ట్రస్ట్ కు సికింద్రాబాద్ కు చెందిన పద్మావతి సొల్యూషన్స్ అధినేత శ్రీధర్ శుక్రవారం రూ.10, 01, 116 ( పదిలక్షల వెయ్యి నూట పదహారు) విరాళంగా అందించారు. తిరుమల లోని టీటీడీ చైర్మన్ క్యాపు కార్యాలయంలో ఈ మేరకు డిడిని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి కి అందజేశారు.చైర్మన్ వైవి సుబ్బారెడ్డి నేతృత్వంలో గో సంరక్షణకు టీటీడీ చేపట్టిన చర్యలకు సంతోషించి ఈ విరాళం అందించినట్లు దాత తెలిపారు.

## క్యూలైన్లలో భక్తులకు ఆహారం, పాలు అందించండి

**- అధికారులకు టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆదేశం**

తిరుమల మార్చి 25 శ్రీవారి దర్శనం కోసం క్యూ లైన్లలో వెళ్ళే భక్తులకు ఆహారం, పాలు అందించాలని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుమల లో భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో శుక్రవారం ఆయన స్లాట్ సర్వదర్శనం క్యూ లైన్లను పరిశీలించారు. భక్తులతో మాట్లాడి దర్శనం కోసం ఎదురు చూస్తున్న సమయంలో తాగు నీరు, మరుగు దొడ్ల సదుపాయాలు సరిగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. క్యూ లో దర్శనానికి వెళుతున్న భక్తులతో మాట్లాడారు. క్యూ లైన్ల నిర్వహణ పరిశీలించారు. సర్వదర్శనం ఎంత సమయంలో అవుతోందని అధికారులను అడిగారు. ఉదయం అయితే గంటన్నర లోపు, సాయంత్రం 6 గంటల తరువాత వారికి రెండు గంటల్లో అవుతోందని అధికారులు తెలిపారు. క్యూ లైన్ లో భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజిఓ బాలిరెడ్డి ని చైర్మన్ ఆదేశించారు.

## ఆర్ ఆర్ ఆర్ సినిమా చూస్తూ గుండెపోటుతో మృతి

అనంతపురం అనంతపురంలో విషాదం నెలకొంది. ఎస్వీ మ్యాక్స్ థియేటర్లో ఆర్ ఆర్ ఆర్ సినిమా చూస్తూ గుండెపోటుతో ఓ అభిమాని చనిపోయాడు. సినిమా చూస్తూ.. అభిమాన హీరోల వీడియోలను చిత్రీకరిస్తూ అతడు కుప్పకూలినట్లు స్నేహితులు చెప్పారు. చికిత్స నిమిత్తం అతడ్ని ఆస్పత్రికి తరలిస్తుండగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

## ఏప్రిల్ 2న శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకలు

తిరుపతి, మార్చి 25 సిరుల తల్లి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఏప్రిల్ 2వ తేదీ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఉదయం 4.30 గంటలకు సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామ అర్చన, నిత్యార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు పుష్ప పల్లకిలో అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రాత్రి 8 నుండి 8.30 గంటల వరకు పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానం నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 7 నుండి 7.45 గంటల వరకు శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఉత్సవర్లకు అభిషేకం, సాయంత్రం 5 నుండి 5.30 గంటల వరకు ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విఐపి బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవలైన ఊంజల్ సేవను టిటిడి రద్దు చేసింది.

## మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు




న్యూఢిల్లీ మార్చ్ 25 పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. ధరల పెంపుదలకు ఒక్కరోజు బ్రేక్ ఇచ్చిన దేశీయ చమురు కంపెనీలు తాజాగా లీటరు పెట్రోల్, డీజిల్‌పై 80 పైసల చొప్పున వడ్డించాయి. దీంతో ఈ వారంలో పెట్రో, డీజిల్ ధరలు పెరగడం ఇది మూడోసారి. తాజా పెంపుతో దేశ ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.97.81, డీజిల్ ధర రూ.89.07కు చేరాయి. ముంబైలో పెట్రోల్ రూ.112.51, డీజిల్ రూ.96.70గా ఉన్నాయి. ముంబైలో పెట్రోల్ రూ.112.51 (84 పైసలు), డీజిల్ రూ.96.70గా (85 పైసలు) ఉన్నాయి. చెన్నైలో 76 పైసల చొప్పున పెరగడంతో పెట్రోల్ రూ.103.67, డీజిల్ రూ.93.71, కోల్‌కతాలో పెట్రోల్ రూ.106.34 (84 పైసలు), డీజిల్ రూ.91.42 (80 పైసలు)కి చేరాయి.ఇక హైదరాబాద్‌లో లీటరు పెట్రోలుపై 90 పైసలు, డీజిల్‌పై 87 పైసల చొప్పున అధికమయ్యాయి. దీంతో పెట్రోలు ధర రూ.110.91, డీజిల్ రూ.97.23కు చేరాయి. కాగా, దేశంలో గతేడాది నవంబర్ 4వ తేదీ తర్వాత మొదటిసారిగా మార్చి 22న పెట్రోల్, డీజిల్ ధరలు అధికమయ్యాయి. మార్చి 23న కూడా చమురు కంపెనీలు ధరలు పెంచాయి. తాజా పెంపుతో మూడు రోజుల్లోనే లీటరు పెట్రోల్, డీజిలు ధరలు రూ.2.40 చొప్పున పెరిగాయి.అయితే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగిపోవడంతో చమురు కంపెనీలు లీటరు డీజిలుపై రూ.13.1 నుంచి రూ.24.9 వరకు, పెట్రోలుపై రూ.10.6 నుంచి రూ.22.3 వరకు వడ్డించే అవకాశం ఉన్నదని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## పౌరహక్కుల దోపిడి రహిత సమాజం కోసం ప్రగతి-శీల ఉద్యమాలు

**సీపీఐ( ఏమ్ ఎల్) క్రాంతి జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభకర్**

గుంటూరు మార్చ్ 25 దేశంలో,రాష్ట్ర లలో పౌరహక్కులు ప్రమాదంలో పడ్డాయనిసీపీఐ( ఏమ్ ఎల్) క్రాంతి జాతీయ కార్యదర్శి మల్లేపల్లిప్రభకర్ అన్నారు,గుంటూరు లో జరిగిన పార్టీ ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ,ని దళారీ,బూర్జువా, బస్వామ్య గుత్తా పెట్టుప్బడి దార్ల చేతుల్లో సహజవనరుల,,పూర్తి సంపదను వారి కబంధ హస్తలో ఉంచుకొని,,ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమిస్తున్న ప్రజలపై నాయకులపై" నల్లా చెట్టాలు మోపుతూ సుదీర్ఘంగా జైల్లో ఉంచుతూ,,ఆదివాసీ హక్కులు అదివిలోని సహజ నిది నిక్షేపాలు,రంగురలు,విలువైన అడివి సంపదకు రక్షణ ఉన్న విప్లవ సంస్థల నాయకులను,,కార్య కర్తలను,,కాల్చి చెంపుతున్నరన్నారు.దేశంలో, రాష్ట్రంలో పోలీస్ రాజ్యం అమలు జరుగుతున్నదని మండి పడ్డారు, ఆల్ ఇండియా సివిల్ రైట్స్ ఫోరం కన్వీనర్ తరుణ్ బోస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రాలలో అప్రటిత ఎమర్జెన్సీబిజెపి నాయకత్వంలో అమలు జరుపుతూ,,కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నరని విమర్శించారు,,ప్రజల అస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను,,కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా అమ్మేసే హక్కు వీరికి ఎవరిచ్చారు ప్రశ్నినీచ్చారు,,ప్రజా ప్రజాస్వామిక హక్కులు, రాజ్యహింస, దళారీ దోపిడీ పాలకులకు వేతిరేకంగ ప్రగతి శీల ఉద్యమాలకు పీడిత ప్రజలందరూ సిద్దం కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో విప్లవ మహిళ సంఘం అధ్యక్షురలు సంపంగి పదమ్మక్క,, ఒ ద్రిస్సా నాయకురాలు లక్ష్మి ,కార్మిక సంఘం నాయకుడు అశోక్, ఆల్ ఇండియా సివిల్ రైట్స్ పోరం అదేక్షుడు తరుణ్ బోస్,, కర్ణాటక మహిళ సంఘం నాయకురాలు అమృత పాటిల్తదితరాలు పాల్గొన్నారు

## 1000 కోట్లతో సమీకృత స్వచ్ఛనీటి చేపలు, రొయ్యలు

హైదరాబాద్, మార్చి 25 (న్యూస్ పల్స్)ప్రపంచంలోనే అతిపెద్ద చేపల ఎగుమతి సంస్థ ఫిష్ఇన్ తెలంగాణలో భారీ పెట్టుబడులకు ముందుకొచ్చింది. రూ.1000 కోట్లతో సమీకృత స్వచ్ఛనీటి చేపలు, రొయ్యల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అమెరికా పర్యటనలో ఉన్న పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీరామారావు సమక్షంలో సంస్థ ఛైర్మన్, సీఈవో మనీశ్‌కుమార్ గురువారం తమ నిర్ణయాన్ని వెల్లడించారు. సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు రిజర్వాయర్ వద్ద ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని నిర్మిస్తామని, 5వేల మందికి ఉపాధి కల్పిస్తామని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు ప్రసిద్ధ వైద్య పరికరాల తయారీ సంస్థ కన్‌ఫ్లూయెంటు మెడికల్ టెక్నాలజీస్ సైతం రూ.150 కోట్లతో హైదరాబాద్‌లోని వైద్యపరికరాల పార్కులో ఆధునిక నికెల్ టైటానియం (నిటినోల్) ఉత్పత్తుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. సంస్థ ఛైర్మన్, సీఈవో డీన్‌షావర్ కేటీఆర్‌తో సమావేశంలో తమ నిర్ణయాన్ని తెలిపారు. తెలంగాణలో ఔషధ, జీవశాస్త్రాలకు పెద్దపీట వేస్తున్నామని, దేశంలో ఎక్కడాలేని విధంగా రాయితీలు, ప్రోత్సాహకాలను అందిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. అమెరికాకు చెందిన అంతర్జాతీయ సంస్థల అధిపతులు, పారిశ్రామికవేత్తలతో అమెరికాలోని బే ఏరియాలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.ఫిష్ఇన్ ఛైర్మన్ మనీశ్‌కుమార్ శాన్‌జోస్‌లో కేటీఆర్‌ను కలిసి తమ కొత్త ప్రాజెక్టుపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ‘ చేపల ఎగుమతిలో అగ్రస్థానంలో ఉన్న మా సంస్థ విస్తరణలో భాగంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛనీటి రిజర్వాయర్లను అన్వేషించాం. తెలంగాణలోని మధ్యమానేరు గురించి సమాచారం తెలుసుకున్నాం. అద్భుత జలాశయాల్లో ఇదొకటి. మాకు అన్నివిధాలా అనుకూలంగా ఉండడంతో పాటు అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రోత్సాహకాలపై మంత్రి కేటీఆర్ భరోసా ఇవ్వడంతో అక్కడే తమ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. చేపల ఉత్పత్తి, శుద్ధి, కేజ్‌కల్చర్, దాణా తయారీ, ఎగుమతులు వంటి అనేక విభాగాలను నెలకొల్పుతాం. కంపెనీ పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత సుమారు 85 వేల మెట్రిక్ టన్నుల చేపలను ఏటా దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తాం’ అని తెలిపారు. తెలంగాణలో భారీ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమైన ఫిష్ఇన్ సంస్థకు ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.కన్‌ఫ్లూయెంట్ మెడికల్ టెక్నాలజీస్ సంస్థ ఛైర్మన్ డీన్‌షావర్ కాలిఫోర్నియాలో తమ ప్రతినిధి బృందంతో కలిసి మంత్రి కేటీఆర్‌తో భేటీయై పెట్టబడులకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా డీన్‌షావర్ మాట్లాడుతూ.. ‘హైదరాబాద్‌లోని అద్భుత ప్రగతి సాధిస్తోన్న వైద్యపరికరాల పార్కులో మా యూనిట్‌ను ఏర్పాటు చేస్తాం. ముందుగా ఓ పరిశ్రమను 12 నెలల్లో ప్రారంభించి తర్వాత భారీగా విస్తరిస్తాం. దేశానికి తొలిసారిగా అత్యంత అధునాతన సాంకేతికత అయిన నిటినోల్‌ను తీసుకురావాలన్న లక్ష్యంతో హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్నాం. భారత్‌లో నిటినోల్ సాంకేతికత గల మొదటి సంస్థగా మేం నిలవబోతున్నాం.

## ఆదర్శంగా నిలుస్తున్న స్నేహ కిరణ్

శ్రీకాకుళం, మార్చి 25, వరి ఇంట అయినా ఆడపిల్ల పుట్టిందంటే టక్కున లక్ష్మీ దేవి పుట్టిందని తెగ సంబర పడతారు? అది అక్షరాలా నిజం చేసింది ఈ పేదింటి చదువుల సరస్వతీ. శ్రీకాకుళం జిల్లా మందస మండలం, రాంపురం గ్రామానికి చెందిన కొంచాడ సింహాచలం, సుహాసిని దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమార్తె కొంచాడ స్నేహ కిరణ్, కుమారుడు సూర్య కిరణ్. ఐటీబీపీ పారామిలటరీలో పని చేస్తూ ఉండగా తండ్రి సింహాచలం ఆరోగ్య పరిస్థితి దెబ్బతినడంతో.. 13 ఏళ్ల క్రితం వాలంటీర్ రిటైర్మెంట్ తీసుకొని జీడిపప్పు తయారీ కర్మాగారంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి సుహాసిని గృహిణి? అటువంటి పేద ఇంట పుట్టిన ఆడ పిల్ల ఏకంగా ఏడాదికి 44 లక్షల రూపాయలు సంపాదించే కొలువును కైవసం చేసుకోవడంతో ఆ పెద ఇంట సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి.నిరు పేద కుటుంబంలో పుట్టిన ఆ ఇద్దరు పిల్లలకు సరస్వతీ కటాక్షం చిన్నతనంలోనే లభించింది. చదుపై వారికున్న ఆసక్తిని గుర్తించిన చదువు రాని తల్లిదండ్రులు కాయ కష్టం చేసి ఇద్దరిని ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తూ వచ్చారు. అలా తల్లిదండ్రులు కష్టాన్ని కళ్లారా చూసిన ఆ ఇద్దరు పిల్లలు అహర్నిశలూ శ్రమించి చదువులో ముందు వరుసలో నిలిచారు. వీరిలో కుమార్తె స్నేహ కారణ్‌కు గణితంపై మక్కువ ఎక్కువ. నాలుగేళ్ల క్రితం ఎంసెట్ పరీక్షలో ఏకంగా 7000ల ర్యాంకు సాధించింది. ఈ ర్యాంకుతో విశాఖపట్నం అనిట్స్ లో సీఎస్సీ గ్రూప్ లో సిటు వచ్చింది. చదివిన చదువును సార్థకం చేసుకునే ఛాన్స్ వచ్చిన స్నేహ ఆ సదావకాశాన్ని సద్వినియోగపరచుకుంది. నాలుగేళ్లపాటు కష్టపడి చదివి చివరి ఏడాదిలో కళాశాల యాజమాన్యం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఏడాదికి ఏకంగా 44 లక్షల రూపాయల ప్యాకేజీతో అమెజాన్ కంపెనీకి ఎంపికైయింది. కరోనా కష్టకాలంలోనూ ఆన్‌లైన్ క్లాసులను బోధించిన అధ్యాపకులు, తోటి విద్యార్థుల సహకారంతో ఈ కొలువును సొంతం చేసుకున్నట్లు స్నేహ ఆనందం వ్యక్తం చేసింది. ఈ మేరకు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన విజయగాథను పంచుకుంది స్నేహ కారణ్.

## అమరావతిలో నిర్మాణాల సందడి



గుంటూరు, మార్చి 25, మరావతిలో నిర్మాణాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. హైకోర్టు తీర్పు తర్వాత ప్రభుత్వం పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. 70 శాతానికిపైగా పూర్తయిన ఏఐఎస్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయాల నిర్మాణ పనులు.. అలాగే హైకోర్టు న్యాయమూర్తుల నివాస భవనాల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. వీటిని ఈ ఏడాది నవంబరు నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నారు. నిధుల కోసం ప్రభుత్వం బ్యాంకులను అప్పు అడుగుతోంది.బ్యాంకుల కన్సార్షియం నుంచి ఓ విడత రుణం అందింది. రూ.200 కోట్లు ఇచ్చేందుకు కన్సార్షియం ముందుకొచ్చింది. ఇందులో ఇప్పటికే రూ.95 కోట్ల వరకు వచ్చాయి.మిగిలిన మొత్తం కూడా త్వరలో వచ్చే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నిధులతో ప్రస్తుతం పనుల వేగం పెంచాలని నిర్ణయించారు. అయితే నిర్మాణాలు ప్రారంభించాలంటే ముందు కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాలి. బ్యాంకుల నుంచి వచ్చే రుణం మేరకు వారికి చెల్లించే ఏర్పాట్లు చేస్తున్నారు. తక్కువ నిధులతో అందుబాటులోకి వచ్చే భవనాల జాబితాను తీసుకుని ఆ మేరకు పనులను ప్రారంభిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇచ్చే రుణం అఖిల భారత సర్వీసు అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లకే సరిపోతుంది. మిగిలిన టైప్ 1, 2, నాలుగో తరగతి ఉద్యోగుల నివాస సముదాయాల నిర్మాణాలు 65 శాతం పూర్తయ్యాయి. వీటి పనులు తిరిగి ప్రారంభించేందుకు మరో మార్గంలో రుణం కోసం సీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో పరిపాలనా వ్యవహారాలన్నీ అమరావతి నుంచే సాగుతున్నాయి. అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణాలు ప్రారంభించాలన్న డిమాండ్ పెరుగుతోంది. కేంద్ర సంస్థలు కూడా నిర్మాణాలు ప్రారంభిస్తే అమరావతి పుంజుకున్నట్లే.

## మార్చి 28న అలిపిరిలో మెట్లోత్సవం

తిరుపతి, మార్చి 25 పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమయ్య 519వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని అలిపిరి పాదాలమండపం వద్ద మార్చి 28వ తేదీ టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మెట్లోత్సవం వైభవంగా జరుగనుంది. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, భజన మండళ్ల కళాకారులు ఉదయం 6 గంటల నుంచి అన్నమాచార్యుల వారి "సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం" నిర్వహిస్తారు. అనంతరం శాస్త్రోక్తంగా మెట్లపూజ జరుగనుంది. ఆ తరువాత కళాకారులు సంకీర్తనలు గానం చేస్తూ నడక మార్గంలో తిరుమలకు చేరుకుంటారు. టిటిడి అధికారులు, రాష్ట్రం నలుమూలల నుంచి భజన మండళ్లకళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా మార్చి 29 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సులు, మహతి కళాక్షేత్రం, తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## తిరుమలలో టీటీడీ ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు

తిరుమల మార్చ్ 25 తిరుమల శ్రీవారి దర్శనం కోసం రద్దీ భారీగా పెరిగిన నేపథ్యంలో టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాంభగీచా బస్టాండ్ బస్టాండు సమీపంలోని అన్న ప్రసాద వితరణ కౌంటర్ ను పరిశీలించారు. భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో భక్తులకు తాగునీటి ఇబ్బంది లేకుండా, పారిశుధ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం పి ఎ సి 1 కు వెళ్ళి అక్కడ ఉన్న భక్తులతో మాట్లాడారు. గదులు సులువుగా దొరుకుతున్నాయా, దర్శనం ఎలా అయ్యింది, ఎంత సమయం పట్టింది అని తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఇక్కడ పారిశుధ్యం మరింత మెరుగు పరచడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ శ్రీదేవి, విజిఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో చిన్న పరిశ్రమలు నిర్వహించేందుకు యువత ముందుకు రావాలి

## ఆంధ్ర ప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ శోభారాణి



నంద్యాల ( విభారె) :- పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వము. ప్రోత్సాహం ఇస్తుందని ఆంధ్ర ప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ శోభారాణి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణ శివార్లలోని ప్రథమ నంది దేవస్థానం దగ్గర గల వైయస్ అర్ . కళ్యాణ మండపంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన(పి యం ఈ జి పి) కార్యక్రమంపై ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో నిర్వహించిన నిరుద్యోగ యువతకు చిన్న పరిశ్రమలపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి. నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబూనిషా. లు హాజరయ్యారు.ఆంధ్ర ప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ శోభారాణి . ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్ర నాథ్.కె వి ఐ బి డిప్యూటీ డైరెక్టర్ ఉమా మహేశ్వరి. నంద్యాల కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఈశ్వరయ్య. పరిశ్రమల శాఖ ఎపిఓ చంద్రశేఖర రావు. బీసీ ఫెడరేషన్ ధనుంజయా చారి .కౌన్సిలర్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి. నంద్యాల పురపాలక సంఘం చైర్మన్ షేక్ మాబూన్నీషా . మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విద్యనభ్యసించిన నిరుద్యోగులకోసం ప్రభుత్వాల సహకారంతో పట్టణాలలో మరియు గ్రామీణ ప్రాంతాలలో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం ఎలా అనేదానిపై ఈ అవగాహన కల్పిస్తున్నారని కావున నిరుద్యోగులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ గ్రామంలో కానీ మీ పట్టణం లో కానీ చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని మీరు ఉపాధి పొందుతూ ఇతరులకు కూడా ఉపాధి అవకాశం కల్పించేలా తయారు కావాలని వచ్చిన యువతను కోరుతూన్నామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకోమని ప్రభుత్వమే మన వద్దకు వచ్చిందని ఈ వచ్చినటువంటి అధికారుల సలహాలు సూచనలతో పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. కొలిమిగుండ్ల మండల ప్రాంతంలో మైనింగ్ సంబంధించినటువంటి పరిశ్రమలను. మరియు వడ్రంగి కి సంబంధించినవి. ఇళ్ల నిర్మాణాల్లో సెంట్రింగ్ కి సంబంధించినటువంటి పరిశ్రమలు పెట్టుకోవడానికి యువత ముందుకు వస్తున్నారని వారికి చేయూతనిచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా సహాయ సహకారాలు అందించమని వచ్చిన అధికారులను కోరామన్నారు. అందుకు వారు సుముఖత వ్యక్తం చేశారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు కూడా చేసుకో మన్నారు.

# శభాష్ పురం గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు









తుగ్గలి( విభారె) : మండల పరిధిలోని శభాష్ పురం గ్రామంలో గ్రామ సర్పంచ్ పుష్పవతి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను పారిశుద్ధ కార్మికులు నిర్వహించారు. శభాష్ పురం గౌరవ సలహాదారులు రవి ఆధ్వర్యంలో శభాష్ పురం గ్రామంలో జెసిబి ద్వారా మురుగునీటి కాలువలలో పేరుకుపోయిన మట్టిని,చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించి గ్రామాన్ని శుభ్రపరిచారు.జి.జి రాళ్ల, దిగువ చింతల కొండ గ్రామాలలో కూడా పారిశుద్ధ కార్మికుల ద్వారా పారిశుద్ధ పనులను నిర్వహించారు.గ్రామాలలో ఎటువంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుద్ధ్య పనులను నిర్వహించినట్లు సర్పంచ్ పుష్పవతి, గౌరవ సలహాదారులు రవి తెలియజేశారు. అదేవిధంగా శభాష్ పురం గ్రామంలో తాగునీటి పైపులైన్లు కూడా మరమ్మతులను నిర్వహించారు.గ్రామాల పరిశుభ్రత కొరకు కేంద్ర ప్రభుత్వం అందజేసే స్వచ్ఛ సంకల్పం ట్రై సైకిల్ ద్వారా గ్రామాలలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తామని వారు తెలియజేశారు. పనులను సచివాలయ సిబ్బంది కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం పాలక మండలి సభ్యురాలిగా జే.సుజాత ప్రమాణ స్వీకారం









## సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించిన ఈవో లవన్న

మంత్రాలయం ( విభారె) : శ్రీశైలం పాలక మండలి సభ్యురాలుగా మంత్రాలయంకు చెందిన జే. శంకర్ సతీమణి జే.సుజాత శుక్రవారం శ్రీశైలంలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో ఈవో లవన్న శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ఎన్నికైన వారిచే శుక్రవారం ఉధయం ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీశైలం పాలక మండలి సభ్యురాలు గా ప్రమాణ స్వీకారం చేసిన సుజాత మాట్లాడుతూ శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా మాకు అవకాశం కల్పించిన పెద్దాయన సీతారామి రెడ్డి గారికి మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గారికి యువ నాయకులు ప్రధీప్ రెడ్డి మరియు ధరణీధర్ రెడ్డి గార్లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీశైలం పాలక మండలి సబ్యురాలుగా శ్రీశైలం ధేవ దేవస్థానానికి భక్తులకు సేవ చేస్తానని అన్నారు. చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి ఈవో లవన్న సహకారంతో కమిటీ సభ్యులు సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆమె తెలియజేశారు. శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ గా నా పేరు సిఫారసు చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు .అలాగే వీరశైవ లింగాయత్ ,జంగమ మహేశ్వర సంఘాలకు వీరశైవ లింగాయత్ సంఘాలకు అలాగే మంత్రాలయంలోని జంగమ వీరశైవ లింగాయత్ లకు కుటుంబ సభ్యులకు బంధుమిత్రులకు స్నేహితులకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ జే.సుజాతక భర్త ఆడిటర్ శంకర్ కూడా ఉన్నారు. అర్చకులు వీరభద్రయ్య స్వామి ,యల్లా లింగా స్వామి తదితరులు ఉన్నారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ 10 లక్షలు టోకరా

డోన్ డోన్ పట్టణంలో లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ 10 లక్షలు డోక్రా పెట్టిన పింజారి చాంద్ బాషా పై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు పట్టణ సిఐ మల్లికార్జున గురువారం రాత్రి తెలిపారు పట్టణంలోని కొండపేట ఫోన్ చెందిన చాంద్ భాషా శ్రీరామ ది మేటర్ సమీపంలో పై వేటు ఏజెన్సీ ఆఫీసును ఏడాది క్రితం ప్రారంభించాడు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురిని నమ్మించాడు కొండపేట కు చెందిన కల్పనా బాయ్ కి మున్సిపాలిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు రైల్వేలో కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మాయమాటలు చెప్పాడు దీంతో కల్పనా బాయ్ తో పాటు ఆమె బంధువులు మరో నలుగురు కలసి రూ 10 లక్షలు చాంద్ భాషా ఇచ్చారు కొన్ని నెలలుగా చాంద్ భాషా చుట్టూ తిరుగుతూ వస్తున్నారు చివరకు చాంద్ భాషా కనిపించకుండా ఉడాయించాడు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సిఐ తెలిపారు

# రాష్ట్ర రేషన్ డీలర్స్ కోశాధికారి కె మదు సుధన్ రావు గుండె పోటు తో మృతి

నంద్యాల ( విభారె) :- నంద్యాల పట్టణంలో గురువారం రాత్రి రాష్ట్ర రేషన్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి కె మదు సుధన్ గుండె పోటు తో మరణించారు. రాత్రి 11-30 నిమిషాలకు శాతి నొప్పి రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని డాక్టర్ ధ్రువీకరణ చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. నంద్యాల తహసీల్దార్. మరియు పుడ్ ఇన్స్పెక్టర్ యుగందర రెడ్డి. గోడంగు ఇన్ చార్జీ విజయ శేఖర్. రెవెన్యూ ఇన్ స్పెక్టర్. నంద్యాల టౌన్ రేషన్ డీలర్ల అసోసియేషన్. కర్నూలు జిల్లా డీలర్ల సంఘం కార్యదర్శి బ్రహ్మయ్య. తదితరులు నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలపై నిత్యం



పోరాడుతూ తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు అని అన్నారు. డీలర్లు మంచి వ్యక్తిని కోల్పోయారని అన్నారు. రాష్ట్ర అసోసియేషన్ వారు కర్నూలు జిల్లా అసోసియేషన్. చుట్టుపక్కల మండలాల అసోసియేషన్ డీలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ట్రిపుల్ ఆర్ టీమ్ పరిచయం చేసిన 'అధీర'




యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ స్టార్స్ తో కాకుండా సూపర్ హీరోస్ కథలతో సినిమాలు చేస్తుండటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తన టాలెంట్ కి స్టార్ లతో సినిమాలు చేసే అవకాశం వున్నా ప్రత్యేక కథలతో సూపర్ హీరోస్ ని సృష్టిస్తున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ప్రస్తుతం ఇండియన్ ఫస్ట్ ఒరిజినల్ సూపర్ హీరో స్టోరీ అంటూ 'హను మాన్' మూవీని యంగ్ హీరో తేజ సజ్జతో తెరకెక్కిస్తున్న ప్రశాంత్ వర్మ తాజాగా మరో క్రేజీ సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్ కు శ్రీకారం చుట్టారు.ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న మరో సూపర్ హీరో మూవీ 'అధీర'. ఈ చిత్రం ద్వారా ట్రిపుల్ ఆర్ ప్రొడ్యూసర్ డీవీవీ దానయ్య తనయుడు కల్యాణ్ హీరోగా పరిచయం అవుతున్నారు. ప్రైమ్ షో ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ఈ మూవీని స్టార్ ప్రొడ్యూసర్ నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. గత కొంత కాలంటగా తన తనయుడిని హీరోగా పరిచయం చేయాలని నిర్మాత దానయ్య పలువురు డైరెక్టర్ లని పరిశీలించారు. ఫైనల్ గా ప్రశాంత్ వర్మ చెప్పిన సూపర్ హీరో స్టోరీ నచ్చడంతో తన తనయుడు కల్యాణ్ బాధ్యతల్ని ప్రశాంత్ వర్మకు అప్పగించారు. భారతీయ ఇతిహాసాల్లోన్ని ప్రధాన పాత్రలని స్ఫూర్తిగా తీసుకుంటూ సూపర్ హీరోస్ కథల్ని తెరపైకి తీసుకొస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ చిత్ర టీజర్ ని దర్శకుడు రాజమౌళి హీరోలు రామ్ చరణ్ ఎన్టీఆర్ బుధవారం విడుదల చేశారు. చిన్నతనం నుంచి ఎలక్ట్రిక్ పవర్ ని కలిగి వుంటే ఓ సూపర్ హీరో కథగా ఈ మూవీని ప్రశాంత్ వర్మ తెరకెక్కించబోతున్నారు. పెద్దయ్యాక కూడా ఆ పర్ తో అతను ఎలాంటి అద్భుతాలు సృష్టించాడు అనే ఆసక్తికరమైన కథ కథనాలతో ఈ మూవీని తెరపైకి తీసుకురాబోతున్నారు.హాలీవుడ్ మార్వెల్ హీరోస్ తరహాలో ఈ మూవీలో హీరో పాత్రని డిజైన్ చేసినట్టుగా టీజర్లోని సన్నివేశాల ద్వారా స్పష్టమవుతోంది. ఇక ఈ చిత్రాన్ని పాన్ ఇండియా వైడ్ గా తెలుగు తమిళ కన్నడ మలయాళ హిందీ భాషల్లోనూ విడుదల చేయబోతున్నారు. టీజర్ లో తనపైకి వస్తున్న రౌడీలని మట్టికరిపించే క్రమంలో హీరో చేతుల్లో ఎలక్ట్రిక్ స్పార్క్ కనిపించడం...చిన్నతనంలో తనని దండించడానికి ఓ వ్యక్తి హంటర్ని విసిరితే దానికి స్పార్క్ రావడం.. చనిపోయిన వ్యక్తికి తన పవన్ ని ఉపయోగించి ప్రాణం పోయడం.. చేతుల్లో స్పార్క్ తో ఖడ్గాన్ని సృష్టించడం వంటి సినిమాటిక్ ఎలిమెంట్స్ తో ఈ చిత్రాన్ని బారీ స్థాయిలోనే తెరపైకి తీసుకురాబోతున్నారు.టీజర్ బీజీఎమ్ అదిరింది. శ్రీమతి చైతన్య సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే స్క్రిప్ట్ విల్లే కెమెరా దాశరథి శివేంద్ర సంగీతం గౌరిహరి. హను -మాన్ పూర్తయిన తరువాత ఈ చిత్రాన్ని సెట్స్ పైకి తీసుకెళ్లబోతున్నారు.

# మొదటి రోజు నుండే 'బాహుబలి 2' రికార్డుల బ్రేక్ షురూ



ప్రభాస్.. రాజమౌళి ల కాంబోలో వచ్చిన బాహుబలి 2 సినిమా సంచలన రికార్డులను ఇన్ని సంవత్సరాలు అయినా ఏ ఒక్క సినిమా కూడా బ్రేక్ చేయలేక పోతుంది. లాంగ్ రన్ లో వచ్చిన వసూళ్లతో పాటు పలు ఏరియాల్లో విడి విడిగా వచ్చిన వసూళ్లను కాని.. దేస్ వైజ్ గా వచ్చిన వసూళ్లను కాని ఏ ఇండియన్ సినిమా బీట్ చేయలేక ఆ రికార్డులు ఏళ్ల తరబడి అలాగే కంటిన్యూ అవుతున్నాయి.బాహుబలి 2 మొదటి రోజు దాదాపుగా 43 కోట్ల రూపాయల షేర్ ను దక్కించుకున్న విషయం తెల్సిందే. రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లను నమోదు చేసిన బాహుబలి 2 ని ఇప్పుడు ఆర్ ఆర్ ఆర్ క్రాస్ చేయడం దాదాపుగా కన్ఫర్మ్ అయ్యింది. మొదటి రోజు ఆర్ ఆర్ ఆర్ సినిమా 60 నుండి 62.5 కోట్ల షేర్ ను దక్కించుకునే అవకాశం ఉందని ఇప్పటికే నమోదు అయిన అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా తెలుస్తోంది.జక్కన్న తన బాహుబలి రికార్డును తన ఆర్ ఆర్ ఆర్ సినిమా తో బ్రేక్ చేయడం ఖాయం అంటూ మొదటి నుండి అంతా అంటూ ఉన్నారు. ప్రతి ఒక్కరు నమ్మినట్లుగానే అనుకుంటున్నట్లుగానే ఆర్ ఆర్ ఆర్ సినిమా వసూళ్ల విషయంలో ఇండియన్ సినిమా కు సరికొత్త హద్దులు క్రియేట్ చేయబోతున్నట్లుగా అనిపిస్తుంది. మొదటి రోజు వసూళ్ల విషయంలో సరికొత్త రికార్డులు నమోదు అవ్వడం ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది.ఇక లాంగ్ రన్ విషయంలో బాహుబలి 2 సినిమా వసూళ్లను బీట్ చేయాలంటే చాలా కష్టమే. కాని జక్కన్న సినిమా ఆర్ ఆర్ ఆర్ కి మాత్రం అది కష్టం కాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సినిమాకు మినిమంగా టాక్ వచ్చినా కూడా ఖచ్చితంగా భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఆర్ ఆర్ ఆర్ రికార్డుల వేట మొదటి రోజు మొదలు అయ్యి లాంగ్ రన్ వరకు కంటిన్యూ అయ్యే అవకాశాలు ఉన్నాయి.రామ్ చరణ్ ను అల్లూరి సీతరామరాజు గా ఎన్టీఆర్ ను కొమురం భీమ్ గా రాజమౌళి ఈ సినిమా లో చూపించబోతున్న విషయం తెల్సిందే. ఆ రెండు పేర్లు జనాలకు తెలిసినవే. కనుక ఆసక్తి చాలా వ్యక్తం అవుతుంది. అయితే వారిద్దరి గురించి తెలియని విషయాలను కల్పిత కథనంతో చూపించబోతున్నట్లుగా జక్కన్న చెబుతున్నాడు. విజువల్ వండర్ గా ప్రతి ఒక్క సినీ ప్రేమికుడు ప్రేమించే విధంగా సినిమా ఉంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. అందుకే రికార్డుల మోత మ్రోగడం ఖాయం.

# పెద్ద హీరోలతో సినిమాలు చేసి ఏం లాభం..?

సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఏం జరుగుతుంది.. ఎవరి లైఫ్ ఎలా ఉంటుందో అంచనా వేయలేం. ఒక సినిమాతో ఎక్కడికో వెళ్లిపోవచ్చు.. అదే చిత్రంతో అంతా తలక్రిందులు అవ్వొచ్చు. స్టార్ హీరోలతో సినిమాలు చేసినా కూడా ఒక్కోసారి ఆఫ్ లైన్ లో ఉండి పోవాల్సి వస్తుంది.టాలీవుడ్ లో ప్రభాస్ - పవన్ కళ్యాణ్ వంటి అగ్ర హీరోలతో వర్క్ చేసిన దర్శకులు కొందరు.. తదుపరి ప్రాజెక్ట్ విషయంలో డైలమాలో ఉన్నారు. ఏ హీరోతో చేయబోతున్నారు? ఎప్పుడు సెట్స్ మీదకు వెళ్లారు అనే దానిపై క్లారిటీ ఇవ్వలేకపోతున్నారు.'బాహుబలి' చిత్రంతో పాన్ ఇండియా హీరోగా మారిపోయిన ప్రభాస్.. వవెంటనే పెద్ద డైరెక్టర్ తో సినిమా చేయకుండా.. ఒక్క సినిమా చేసిన అనుభవం ఉన్న యంగ్ డైరెక్టర్ సుజిత్ తో 'సాహో' చేశారు. తెలుగులో నిరాశ పరిచిన ఈ మూవీ.. నార్త్ మార్కెట్ లో సత్తా చాటింది.అయినా ఇంతవరకు సుజీత్ మరో చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకెళ్లలేకపోయారు. అసలు నెక్ట్ ప్రాజెక్ట్ ఎవరితో ఉంటుందనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. చిరంజీవి 'లూసిఫర్' సినిమా రీమేక్ బాధ్యతలు అప్పజెప్పారని అనుకున్నా.. ఆ ప్రాజెక్ట్ చేతులు మారింది. మరి త్వరలో తదుపరి చిత్రంపై అధికారిక ప్రకటన ఇస్తారేమో చూడాలి.పవన్ కల్యాణ్ తో గతేడాది 'వకీల్ సాబ్' వంటి సక్సెస్ ఫుల్ సినిమా తెరకెక్కించారు దర్శకుడు వేణు శ్రీరామ్. 'పింక్' రీమేక్ గా వచ్చిన ఈ చిత్రం పవన్ రీఎంట్రీ సినిమా కావడంతో వేణు పేరు ఇండస్ట్రీలో బాగానే వినిపించింది. సినిమాలో పవన్ ను చూపించిన విధానానికి ఫిదా అయిన ఫ్యాన్స్.. దర్శకుడికి ఏకంగా గుడి కట్టొచ్చని స్టేట్మెంట్స్ ఇచ్చారు.ఈ నేపథ్యంలో అప్పుడెప్పుడో ఆగిపోయిన 'ఐకాన్: కనపడుటలేదు' సినిమా మళ్లీ వార్తల్లోకి వచ్చింది. అల్లు అర్జున్ హీరోగా దిల్ రాజు బ్యానర్ లో వేణు శ్రీరామ్ ఈ ప్రాజెక్ట్ ని డైరెక్ట్ చేస్తారని అఫిషియల్ గా ప్రకటించారు. కానీ అనూహ్యంగా ఈ మూవీ వెనక్కి వెళ్ళింది. అసలు ఉంటుందో లేదో అనే క్లారిటీ కూడా లేదు. మరి త్వరలో వేణుకు దిల్ రాజు మరో ఆఫర్ అందిస్తారేమో చూడాలి.'జిల్' ఫేమ్ రాధాకృష్ణ కుమార్ రెండో సినిమాకే ప్రభాస్ వంటి స్టార్ హీరోని డైరెక్ట్ చేసే ఛాన్స్ కొట్టేసారు. మూడేళ్ళుగా 'రాధేశ్యామ్' ప్రాజెక్ట్ కే అంకితం అయిపోయాడు. అయితే భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా.. ఎన్నో అంచనాల నడుమ విడుదలై ప్రేక్షకులను నిరాశ పరిచింది. దీంతో రాధాకృష్ణ తదుపరి సినిమాపై స్పష్టత లేకుండా పోయింది.ఇక వెంకటేష్ తో 'నారప్ప' చిత్రాన్ని తీసిన శ్రీకాంత్ అడ్డాల.. ఇంతవరకు మరో చిత్రాన్ని స్టార్ట్ చేయలేదు. మహేష్ బాబుతో 'మహర్షి' వంటి బ్లాక్ బస్టర్ అందించిన వంశీ పైడిపల్లి.. మరో చిత్రాన్ని ప్రేక్షకులకు అందించడానికి చాలా సమయమే పడుతోంది. విజయ్ తో బైలింగ్వల్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు కానీ.. ఇంకా రెగ్యులర్ షూటింగ్ మొదలు కాలేదు.ఇలా ప్రభాస్ - మహేష్ బాబు - పవన్ కళ్యాణ్ - వెంకటేష్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసిన దర్శకులు.. తదుపరి చిత్రాలను వెంటనే సెట్స్ పైకి తీసుకురాలేకపోయారు. అందులోనూ పాన్ ఇండియా సినిమాలు చేసిన దర్శకుల చేతిలో ప్రస్తుతానికి మరో ప్రాజెక్ట్ లేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే.

# చహాల్ చేసిన పనికి షాక్ తిన్న క్రికెటర్లు



ఐపీఎల్ 2022 సీజన్ ఆరంభానికి ఇంకా ఒక్కరోజు మాత్రమే మిగిలిఉంది. దాదాపు రెండు నెలల పాటు క్రికెట్ అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. అభిమానులకు ఆనందాన్ని పెంచే పనిలో పడ్డారు క్రికెటర్లు. ఈ నేపథ్యంలోనే రాజస్తాన్ రాయల్స్ ఆటగాడు యజ్వేంద్ర చహల్ చేసిన ఒక పని సోషల్ మీడియాలో ట్రెండింగ్గా మారింది. అతను అన్న మాట రెండు అర్థాలకు దారి తీయడంతోనే ఇక్కడ ఫన్ జనరేట్ అయింది.విషయంలోకి వెళితే.. గురువారం ప్రాక్టీస్ సమయంలో జాస్ బట్లర్, చహల్లు పక్కపక్కనే కూర్చున్నారు. ఏదో విషయమై ఇద్దరు సీరియస్గా మాట్లాడుతున్నారు. ఇంతలో చహల్.. జోషీ బాయ్ కమ్ ఓపెన్ విత్ మి అని పేర్కొన్నాడు. దీంతో షాకైన బట్లర్.. అరె చహల్ భయ్యా ఏంటిది అంటూ తలకు చేతులు పెట్టడం కెమెరాలకు చిక్కింది. వీరి పక్కనే ఉన్న జిమ్మీ నీషమ్ కూడా చహల్ వ్యాఖ్యలపై షాక్ తిన్నాడు.అయితే బట్లర్ను చహల్ అడిగింది ఓపెనింగ్ గురించి. బట్లర్తో కలిసి ఓపెనింగ్ చేస్తానని చెప్పాడు.. దానినే ఇన్డైరెక్ట్గా "ఓపెన్ విత్ మి" అని అన్నాడు. కాగా చహల్ చేసిన వ్యాఖ్యలపై అభిమానులు కూడా వినూత్న రీతిలో స్పందించారు. ఎంతైనా చహల్ కదా.. ఆ మాత్రం ఉండాలి.. ఒక 10వేల ట్వీట్స్ చేయ్.. అప్పుడు నీతో ఓపెన్ అవుతాడు అంటూ కామెంట్స్ చేశారు.ఇక సంజూ శాంసన్ కెప్టెన్సీలో రాజస్తాన్ రాయల్స్ ఈసారైనా కప్పు కొడుతుందా అనేది చూడాలి. మొదటి సీజన్(2008లో) విజేత మినహా రాజస్తాన్ మళ్లీ ఆ ప్రదర్శనను పునరావృతం చేయలేదు. సంజూ శాంసన్ నేతృత్వంలో ఈసారి జట్టు కాస్త బలంగానే కనిపిస్తుంది. మార్చి 29న సన్రైజర్స్తో రాజస్తాన్ రాయల్స్ తన తొలి మ్యాచ్ ఆడనుంది.

## గొప్ప క్రికెటర్.. గొప్ప కెప్టెన్ అవుతాడన్న నమ్మకం లేదు.. కానీ

ధోనితో చెన్నై సూపర్కింగ్స్ కెప్టెన్ కొత్త సారథి రవీంద్ర జడేజాఐపీఎల్-2022 ఆరంభానికి ముందు చెన్నై సూపర్?కింగ్స్ జట్టులో చోటుచేసుకున్న మార్పు గురించి ఢిల్లీ రంజీ జట్టు మాజీ ఆటగాడు రాజ్కుమార్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రవీంద్ర జడేజా అత్యుత్తమ ఆల్రౌండర్ అనడంలో ఎలాంటి సందేహం లేదని, అయితే గొప్ప ఆటగాడు గొప్ప కెప్టెన్ అవ్వాలన్న రూలేమీ లేదని వ్యాఖ్యానించారు. కాగా మెగా టోర్నీ ప్రారంభానికి సరిగ్గా రెండ్రోజుల ముందు సీఎస్కే కెప్టెన్ ఎంఎస్ ధోని కెప్టెన్సీ నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే.ఇందుకు సంబంధించి సీఎస్కే గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ధోని స్థానంలో రవీంద్ర జడేజా సారథ్య బాధ్యతలు చేపట్టినట్లు వెల్లడించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**